అన్నదాతలకు రూ.132.93 కోట్లు

● అర్హులైన 1,94,047 మందికి లబ్ధి
● అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పంపిణీ
● సూపర్‌సిక్స్‌లో మరో అడుగు
● జడ్పీటీసీ ఉప ఎన్నికల కోడ్‌తో.. కడప, కమలాపురం, పులివెందులలో నిలిపివేత

ఎన్నికల హామీలో కీలకమైన అన్నదాత సుఖీభవ పథకం అమలైంది. ఇచ్చిన హామీ మేరకు రైతుల ఖాతాల్లో ఏడాదికి రూ.20వేలు జమచేసేందుకు తొలి విడత నిధులు శనివారం విడుదలయ్యాయి. ఈ మేరకు సీఎం చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లాలోని దర్శిలో ఈ పథకాన్ని ప్రారంభించారు. పీఎం కిసాన్ ద్వారా రూ.2వేలు, అన్నదాత సుఖీభవ కింద రూ.5వేలు మొత్తం రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ అయింది. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకానికి జిల్లాలో 1,94,047 మంది రైతులు అర్హత సాధించారు. వీరికి రూ.7వేల చొప్పున రూ.132.93 కోట్ల లబ్ధి చేకూర నుంది. అయితే ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల కారణంగా కడప, పులివెందుల రెవెన్యూ డివిజన్లలో ఈ పథకం ప్రస్తుతానికి నిలిపివేశారు. ఎన్నికల తరువాత ఈ డివిజన్లలోని రైతుల ఖాతాల్లో జమ కానుంది. సూపర్‌సిక్స్ పథకాలు వరుసగా అమలవుతుండడంతో ఇటు రైతులు, పేద కుటుంబాల్లో హర్షం వ్యక్తమవుతుండగా, టీడీపీలో జోష్ నెలకొంది.



(కడప-ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు సహా కూటమి నేతలు హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగా ఉచిత ఇసుక, అన్నక్యాంటీన్లు, పెన్షన్ల పెంపు, డీఎస్సీ నోటిఫికేషన్, ఉచిత సిలిండర్లు, తల్లికి వందనం పథకాలను అమలు చేశారు. అన్నదాత సుఖీభవ పథకం ఎప్పుడు అంటూ వైసీపీ, ఇతర పార్టీలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుండేవి. కేంద్రం పీఎం కిసాన్ రూ.2వేలు జమ చేసిన రోజే రాష్ట్ర వాటా రూ.5వేలు జమ చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం చెబుతూ వచ్చింది. ఇందులో భాగంగానే సీఎం చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకాన్ని శనివారం దర్శిలో ప్రారంభించారు. ఇప్పటికే ఖరీఫ్ సీజను ప్రారంభమైంది. రైతులు పంటల సాగులో బిజీగా ఉన్నారు. ఈ సమయంలో పంటల సాగు పెట్టుబడికి డబ్బు అవసరం. అప్పు చేసి సాగుకు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఉంది. కరెక్టు టైంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ రూ.7వేలు ఖాతాల్లో జమ కావడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. ఇప్పటికే తల్లికి వందనం ద్వారా ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు రూ.13వేల వంతున జమ అయింది. రెండు నెలలు కాకముందే అన్నదాత సుఖీభవ పథకం అమలు కావడంతో లబ్ధి పొందిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కడప, పులివెందుల, కమలాపురం మినహాయింపు

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. అయితే పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక్కడ కోడ్ అమలులో ఉంది. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయవద్దని ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈసీ ఆదేశాల మేరకు కడప, పులివెందుల రెవెన్యూ డివిజన్ల పరిధిలోని కడప, కమలాపురం, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో పథకం నిలిపివేశారు. ఎన్నికల తరువాత అక్కడ అమలు చేయనున్నారు. ఇక అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభం కార్యక్రమానికి ప్రొద్దుటూరులోని చెన్నమరాజుపల్లెలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ లబ్ధిదారుల వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారులు రూ.కోట్లలో..	అన్నదాతసుఖీభవ రూ.కోట్లలో..	పీఎంకిసాన్ రూ.కోట్లలో..	మొత్తం
బద్వేలు	34,148	17.07	6.17	23.25
జమ్మలమడుగు	35,184	17.59	6.52	24.11
కడప	1,576	0.79	0.19	0.98
కమలాపురం	30,700	15.35	5.69	21.04
మైదుకూరు	34,081	17.04	6.49	23.53
ప్రొద్దుటూరు	10,326	5.16	1.94	7.10
పులివెందుల	41,980	20.99	7.79	28.78
రాజంపేట (సిద్దవటం, ఒంటిమిట)	6,052	3.03	1.12	4.14
మొత్తం	1,94,047	97.0235	35.91	132.93

టీడీపీలో జోష్

సూపర్‌సిక్స్ పథకాలను వరుసగా ఒక్కొక్కటి అమలవుతుండడంతో ఇటు టీడీపీ, అటు కూటమి నేతల్లో జోష్ నెలకొంది. తల్లికి వందనం ద్వారా ఎంత మంది పిల్లలుంటే అంత మందికి డబ్బు జమ అయింది. సరాసరిన ఒక్కో కుటుంబానికి రూ.26వేల దాకా జమ అయింది. పథకం పొందిన వారు ప్రభుత్వం పట్ల సానుకూలత వ్యక్తం చేస్తున్నారు. ఇక అన్నదాత సుఖీభవ జమ కావడంతో రైతులు కూడా హ్యాపీగా ఉన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు కానుంది. ఒక్కో స్కీం అమలవుతుండడంతో ప్రభుత్వానికి మంచి మైలేజీ వస్తుందని కూటమి నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాయాన్ని సద్వినియోగం చేసుకోండి

● సాగులో విప్లవాత్మక మార్పులు రావాలి ● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకోవడంతో పాటు ప్రభుత్వ సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ప్రొద్దుటూరు మండలం చెన్నమరాజుపల్లెలోని రామాలయంలో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద మొదటి విడతలో జిల్లా వ్యాప్తంగా 1.94 లక్షల మంది లబ్ధిదారులకు రూ.132.9 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతుందన్నారు. నిజమైన లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కాకపోతే అలాంటి ఫిర్యాదులపై స్పెషల్‌డ్రైవ్ ద్వారా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయలసీమను హార్టికల్చరల్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. పంట సాగు, ఉత్పత్తి, మార్కెటింగ్ విషయాల్లో రైతులు తమ ఆలోచన విధానంలో మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. మ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్-6 హామీల్లో మరొక హామీని నేడు విజయవంతంగా నెరవేర్చిందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని మొత్తం 10,326 మంది అర్హులైన రైతులకు గాను రూ.7.10 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఈ మేరకు రైతులకు మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏ చంద్రానాయక్, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్, వ్యవసాయ శాఖ ప్రొద్దుటూరు డివిజన్ ఏడీఏ అనిత, ఏవో వరా హరికుమార్, తహశీల్దారు గంగయ్య, సర్పంచులు రాజువారి ఆదిలక్షుమ్మ, కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొదటి విడత మెగా చెక్కును రైతులకు అందిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తదితరులు

పకడ్బందీగా జడ్పీటీసీ ఉప ఎన్నికలు

● డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డ్‌రూమ్ హాలులో జడ్పీటీసీ ఉప ఎన్నికల నిర్వహణపై సీఈవో ఓబులమ్మతో కలసి డీఆర్వో సంబంధిత అధికారులతో సమీక్షించారు. డీఆర్వో మాట్లాడుతూ జడ్పీటీసీ ఉప ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో పులివెందుల, కడప రెవెన్యూ డివిజన్లలో ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందన్నారు. పులివెందుల ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో)గా డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, ఒంటిమిట్టకు డిప్యూటీ కలెక్టర్ రంగస్వామిలను నియమించారన్నారు. పులివెందులకు 12, ఒంటిమిట్ట స్థానానికి 21 నామినేషన్లు వచ్చాయన్నారు. శుక్రవారం నామినేషన్లను పరిశీలించామని, ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు తిరస్కరణకు గురైన వాటిపై ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామన్నారు. పులివెందులలో 15 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 10,601 మంది, ఒంటిమిట్టలో 30 పోలింగ్ కేంద్రాలలో 24,606 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, పులివెందుల ఏఆర్వో కృష్ణమూర్తి, ఒంటిమిట్ట ఏఆర్వో సుజాతమ్మ, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



జడ్పీటీసీ స్థానాలకు ఉప ఎన్నికలపై సమీక్షిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

మూడు రోజులు మద్యం దుకాణాలు బంద్


పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా మూడు రోజులు ఆ రెండుచోట్ల మద్యం దుకాణాలు మూసేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ రెండు మండలాల జడ్పీటీసీ స్థానాలకు ఈ నెల 12న పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పోలింగ్‌కు ముందు రోజు నుంచి కౌంటింగ్ జరిగే రోజు వరకు మద్యం షాపులను తెరవకూడదని పేర్కొన్నారు. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

గండి క్షేత్రంలో భక్తుల సందడి



గండి క్షేత్రంలో భక్తులు

చక్రాయపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో రెండవ శ్రావణ శనివారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. ఎన్నడూ లేని విధంగా దాదాపు 50వేల మంది భక్తులు రావడం విశేషం. వచ్చిన భక్తులకు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, కావలి కృష్ణతేజ, ఉత్సవ కమిటీ సభ్యులు కల్లూరు వెంకటస్వామి దగ్గరుండి సేవలందించారు. భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరడంతో సర్వదర్శనం క్యూ దాదాపు కిలోమీటర్ వెళ్లింది. దర్శనానికి ఆరుగంటలు పట్టింది. ఉదయం 6 నుంచి రాత్రి 9గంటల వరకు భక్తుల రద్దీ నెలకొంది. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేశ్ అంజన్నను పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గండి దేవస్థానంలో వివిధ రకాల సేవల ద్వారా వీఐపీ, స్పెషల్ దర్శనం, లడ్డూ ప్రసాదం, పులిహోర, కల్యాణకట్ట తదితర టికెట్ల ద్వారా రూ.19,50,838 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ తెలిపారు. దేవస్థానం ఆవరణలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. నిత్యాన్నదాన పథకానికి సున్నపురాళ్లపల్లెకు చెందిన హరీష్ ధర్మపత్ని బ్రహ్మణి రూ.50,116, అనంతపురం జిల్లాకు చెందిన రాహుల్‌రెడ్డి, అనుసానరెడ్డి రూ.50,116 విరాళంగా ఇచ్చారు. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎస్‌ఐ రంగారావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. అలాగే ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు, పాలిటెక్నిక్ విద్యార్థులు 600మంది భక్తులకు సేవలు చేశారు. డాక్టర్ వాణి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు.



ప్రత్యేక అలంకరణలో గండి వీరాంజనేయస్వామి

పులివెందులలో పోరు రసవత్తరం

● బరిలోకి బీటెక్ రవి సతీమణి
● రంగంలోకి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

పులివెందుల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నిక పోరు రసవత్తరంగా మారింది. ఇది వైసీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిథ్యం వహించే మండలం కావడంతో ఇక్కడ గెలుపును టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. దీంతో టీడీపీని గట్టెక్కించేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని రంగంలోకి తెచ్చారు. గతంలో బీటెక్ రవి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీచేసిన సమయంలో రాజకీయ చతురత కలిగిన ఆదినారాయణరెడ్డి రంగంలోకి దిగి అన్నీతానై గెలిపించారు. ప్రస్తుతం పులివెందుల జడ్పీటీసీ స్థానానికి ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఉప ఎన్నికల్లో టీడీపీ గెలిచి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం జమ్మలమడుగు పర్యటనలో బీటెక్ రవికి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి చెప్పారు. దీనితో శనివారం నుంచే దీనిపైన ఇరువురు దృష్టిసారించారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి కూడా టీడీపీ కార్యాలయానికి వచ్చి శనివారం ఉదయం నుంచి పార్టీ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో జడ్పీటీసీ ఎన్నికలను బీటెక్ రవి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని ఆహ్వానించారు. వీరిద్దరూ శనివారం మధ్యాహ్నం నుంచి టీడీపీ కార్యాలయంలో పులివెందుల మండల పరిధిలోని ఆరు పంచాయతీల నాయకులను పిలిచి చర్చలు జరిపారు. అక్కడున్న సమస్యలపైన, అక్కడ అవసరమైన మౌలిక వసతులపైన చర్చించారు. దీంతో వైసీపీలో కలవరం మొదలైంది. తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి డబ్బులు జమచేయడం, పెంచిన పింఛన్లు తక్షణం అమలు చేయడం, అన్నదాత సుఖీభవ పథకాలతో ప్రజల్లో సానుకూల స్పందన ఉందని.. దీంతో టీడీపీ అభ్యర్థి అయిన బీటెక్ రవి సతీమణి లతరెడ్డి గెలుపునకు మార్గం సుగమం అవుతుందని వీరు భావిస్తున్నారు. జగన్ సొంత ఊరిలో జడ్పీటీసీ స్థానాన్ని కోల్పోతే వైసీపీకి అవమానం. అందుకని ఎలాగైనా ఇక్కడి జడ్పీటీసీ స్థానాన్ని నిలుపుకోవాలని వైసీపీ ప్రయత్నాలు చేస్తోంది.

గురుకులం.. గోడు చూడండి

● చివరి దశలో ఆగిన పాఠశాల భవన నిర్మాణ పనులు
● అద్దె భవనాల్లో మగ్గుతున్న విద్యార్థినులు
● నెరవేరని ఇన్‌చార్జి మంత్రి హామీ

పులివెందుల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని తొండూరు వద్ద మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాల ఉంది. 2021లో ఈ పాఠశాలలో తరగతులు ప్రారంభమయ్యాయి. అప్పట్లో సొంత భవనాలు లేకపోవడంతో తొండూరు మండలానికి సంబంధించిన ఈ పాఠశాలను వేంపల్లెలో ఒక అద్దె భవనంలో ప్రారంభించారు. అప్పటి నుంచి రెండేళ్ల పాటు వేంపల్లెలోనే పాఠశాల నడిచింది. అనంతరం పులివెందుల పట్టణ శివార్లలో ఓ ప్రైవేటు భవనంలోకి మార్చారు. ఆ ప్రైవేటు భవనం చాలీచాలని విధంగా ఉంది. ఇక్కడ బాత్‌రూములు, హాస్టల్ గదులు సరిగా లేక విద్యార్థినిలు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనాల కోసం తొండూరు-మల్లేల రోడ్డు సమీపంలో 2022లో రూ.35కోట్లతో నిర్మాణాలు ప్రారంభించారు.

5 నుంచి ఇటర్ వరకు..

గురుకులంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు 500 మంది విద్యార్థినులు చదివేందుకు అన్ని హంగులతో దీని నిర్మాణం చేపట్టారు. వైసీపీ హయాంలో చేపట్టిన ఈ పనులు దాదాపు రూ.30కోట్ల మేర పూర్తయ్యాయి. 2024లో అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు ఈ పనులు సాగాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు ఆపేశారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం తరగతి గదుల భవనం నిర్మాణ పనులు పూర్తికావడంతో దానిని ప్రారంభించింది. కానీ విద్యార్థినిలకు అవసరమైన ఇతర భవనాల నిర్మాణం పూర్తికాలేదు. హాస్టల్ గదులకు సంబంధించి పనులు ఆగిపోయే సమయానికి ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ ఇతరపనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పెండింగ్ పనులు పూర్తయితే విద్యార్థినులకు అన్ని హంగులతో భవనం అందుబాటులోకి రానుంది. కానీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. దీంతో గురుకులంలోని విద్యార్థినులకు ఇబ్బందులు తప్పడం లేదు.



తొండూరు వద్ద పూర్తయిన గురుకుల పాఠశాల భవనాలు



అసంపూర్తిగా ఉన్న గురుకుల పాఠశాల హాస్టల్ భవనాలు

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు మొదటిసారి చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న సమయంలో తొండూరులో వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాల మంజూరైంది. 2018లో మంజూరు చేసినా.. ఇక్కడ 2021లో తరగతులు ప్రారంభమయ్యాయి. వీరికోసం చేపట్టిన తొండూరు గురుకుల పాఠశాల నిర్మాణ పనులు చివరి దశలో నిలిచిపోయాయి. దీనితో ఏళ్ల తరబడి విద్యార్థినిలు అద్దె భవనాల్లో అల్లాడుతున్నారు.

ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ హామీ ఇచ్చినా..

రూ.కోట్లు ఖర్చు చేసినా అద్దె భవనాల్లోనే విద్యార్థినులు మగ్గాల్సిందేనా అంటూ నాలుగునెలల క్రితం తొండూరు గురుకుల పాఠశాలపై ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. ఆ సమయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గురుకుల పాఠశాలను పరిశీలించి 2025-26 విద్యాసంవత్సరంలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించి పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని చెప్పారు. కానీ పెండింగ్ బిల్లులు మంజూరు కాలేదు, ఆగిన పనులు ప్రారంభం కాలేదు. దీనితో విద్యార్థినులు అద్దె భవనాల్లోనే ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గురుకుల పాఠశాల విద్యార్థినులు కోరుతున్నారు.



పులివెందుల వద్ద అద్దె భవనాల్లో సాగుతున్న గురుకుల పాఠశాల

టీడీపీలోకి పులివెందుల వైస్ ఎంపీపీ

● నిలువరించేందుకు వైసీపీ నేతల ప్రయత్నాలు విఫలం

పులివెందుల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. జడ్పీటీసీ ఎన్నికలలో గెలిచేందుకు రెండు రోజులుగా టీడీపీ పావులు కదుపుతోంది. అందులో భాగంగా పులివెందుల మండల పరిధిలో ద్వితీయ స్థాయి నాయకులపై దృష్టిసారించింది. శనివారం పులివెందులలో నాటకీయ పరిణామాల మధ్య మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి టీడీపీ కండువా కప్పుకొన్నారు. శుక్రవారం పులివెందుల మండలంలోని ఇ.కొత్తపల్లెకు చెందిన పుష్పనాథరెడ్డి అనే వైసీపీ నేతను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీనితో వైసీపీ మరో నాయకుడు జారిపోకుండా జాగ్రత్తపడాలని భావించింది. కానీ పుష్పనాథరెడ్డి టీడీపీలో చేరిన 24 గంటల్లోనే వైసీపీ నాయకుడు, పులివెందుల వైస్ ఎంపీపీ విశ్వనాథరెడ్డి పులివెందుల టీడీపీ కార్యాలయంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి సమక్షంలో టీడీపీలో చేరారు.

విశ్వనాథరెడ్డిని టీడీపీలోకి వెళ్లకుండా నిలువరించేందుకు అధినాయకత్వమే పావులు కదిపింది. సాక్షాత్తు ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డి తీవ్ర ప్రయత్నాలు సాగించినట్లు తెలిసింది. ఒకానొక సందర్భంలో విశ్వనాథరెడ్డిని హైదరాబాద్‌కు పిలిపించుకుని బుజ్జగించే ప్రయత్నం చేయాలని వీరు ప్రయత్నించినట్లు తెలిసింది. అయితే తొండూరు మండల మాజీ ఉపాధ్యక్షుడు వైపీ మల్లికార్జునరెడ్డి పావులు కదిపి విశ్వనాథరెడ్డిని టీడీపీలో చేరేలా చేశారు. ఇప్పటి వరకు చేరిన ఇద్దరు నాయకులు కూడా ఈ మండలంలో ఓటర్లను ప్రభావితం చేసే వారు కావడం వైసీపీని కలవరపాటుకు చేస్తోంది. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ ఓటర్లను ప్రభావితం చేసే మరో ముఖ్య నాయకుడు ఒకటి రెండు రోజుల్లో టీడీపీలోకి రానున్నట్లు ప్రకటించారు. దీనిని బట్టి చూస్తే జడ్పీటీసీ స్థానంపై పట్టుబిగించేందుకు టీడీపీ సర్వశక్తులు ఒడ్డుతుందనడం స్పష్టం అవుతోంది.



పులివెందుల వైస్ ఎంపీపీ విశ్వనాథరెడ్డిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బీటెక్ రవి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ప్రశ్నార్థకంగా వేరుశనగ సాగు

● పదును లేని వర్షం.. అదును కాని సాగు ● ఆశ చావక విత్తన సాగు

సంబేపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానంగా వర్షాధారం కింద సాగు చేసే పంట వేరుశనగ. జిల్లా వ్యాప్తంగా గతంలో సుమారు 90 వేల నుంచి లక్ష హెక్టార్లపైన వేరుశనగ సాగు చేసేవారు. గత ఏడాది పరిశీలిస్తే ఖరీఫ్‌లో 40 వేల హెక్టార్లలో మాత్రమే వేరుశనగ సాగైంది. ఏ ఏడుకాయేడు వేరుశనగ సాగు తగ్గుతూ వస్తోంది. సంబేపల్లె మండలంలో 2023లో 1280 హెక్టార్లు సాగు చేశారు. 2024లో 980 హెక్టార్లలో, ఈ ఏడాది 180 ఎకరాలు మాత్రమే సాగు చేపట్టగా ఆగస్టు 15 నాటికి సాగు గడువు ముగియనుంది. ఒకప్పుడు గ్రామాల్లో 80 నుంచి 90 శాతం వేరుశనగ పంట సాగు చేసే రైతులు ప్రస్తుతం 10 నుంచి 20 శాతం కూడా కనిపించడం లేదు. రైతులపై ప్రకృతి తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఇలా అయితే వేరుశనగ సాగు ప్రశ్నార్థకమేనని పలువురు రైతులు పేర్కొం టున్నారు.


కొండ్రువాండ్లపల్లె వద్ద ఇటీవల కురిసిన వర్షానికి దుక్కి చేసిన పొలం


ఆశ వీడక విత్తన సాగు చేస్తున్న రైతులు


గాండ్లపల్లి వద్ద దుక్కి చేయని పొలం

అదునులోనూ లేని పదును

ఏరువాక అదును (ఖరీఫ్ సాగు) ఆరుద్ర, పెద్ద పుష్యమి, చిన్న పుష్యమి. ఈ మూడు కార్తెలు ఏరువాక వేరుశనగ సాగుకు అనువైన కార్తెలు, ఆరుద్ర, పెద్ద పుష్యమి కార్తెల్లో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని రైతుల నమ్మకం. చిన్నపుష్యమి కార్తెలో కూడా సాగు చేయవచ్చు కానీ ఆశించిన దిగుబడి రాదని చెబుతుంటారు. జూన్ 15 నుంచి ఆగస్టు 15వరకు వేరుశనగ సాగు సమయం.. ఆ తర్వాత పంట సాగు చేయరు. జూన్‌లో పంట సాగు చేపట్టాలంటే మే నెలలో వర్షాలు కురవాలి. పంటలు దుక్కి చేసుకోవడానికి వర్షాలు పడితే తప్ప సాగు చేపట్టలేరు. ఈ ఏడాది రుతుపవనాల ప్రభావం పెద్దగా కనిపించలేదు. ఎక్కడపడితే అక్కడ ఓ మోస్తారు వర్షాలు తప్ప సరైన పదును లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల పొలాలు దున్నినా చాలాచోట్ల ఇప్పటికీ దున్నకాలు చేపట్టలేదు. మండల వ్యాప్తంగా పలుచోట్ల కొందరు రైతులు ధైర్యం చేసి వేరుశనగ సాగు చేస్తున్నారు.

రైతుల్లో కనిపించని ఉత్సాహం

శెట్టిపల్లె గ్రామం గాండ్లపల్లెలో సుమారు 85 కుటుంబాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరికీ వ్యవసాయ పొలం ఉంది. గతంలో ప్రతి రైతు తనకున్న పొలంలో వేరుశనగ పంట సాగు చేసేవారు. అయితే ప్రస్తుతం ఆ ఊరిలో 10 కుటుంబాలు కూడా వేరుశనగ పంట సాగు చేయడం లేదు. ప్రకృతి విపత్తులు, వరుస నష్టాల వల్ల సాగుకు దూరమైపోయారు. ఏ రైతును పలకరించినా వేరుశనగ సాగు చేయాలంటే వర్షాలతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ఒకప్పుడు వేరుశనగ విత్తన కాయల కోసం రిలీజ్ సినిమా టికెట్ల కోసం ఎగబడినట్లు విత్తన కౌంటర్ల వద్ద రైతులు బారులు తీరి విత్తనకాయల కోసం ఎగబడేవారు. అయితే ప్రకృతి వైపరీత్యాల వల్ల గత ఐదారు సంవత్సరాలుగా పంట సాగు చేయడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగకాయలు అందిస్తోంది. సంబేపల్లె మండలానికి 1650 క్వింటాళ్లు మంజూరు చేశారు. అయితే విత్తనాల కోసం రైతులు మక్కువ చూపడం లేదు. అరకొర సాగు చేసిన రైతులు మార్కెట్‌లో లభించే విత్తన కాయలను కొనుగోలు చేస్తున్నారు. అతి తక్కువ మంది రైతులు మాత్రమే వేరుశనగ సబ్సిడీ కాయలను కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కురిసిన అరకొర వర్షానికి ఆశ చావక కొంతమంది రైతులు వేరుశనగ సాగు చేస్తున్నారు.

ఒకప్పుడు ఊరంతా సాగు చేసేవాళ్లం..



మా ఊరిలో ఒకప్పుడు ఊరంతా వర్షాధారం కింద వేరుశనగ పంట సాగు చేసేవారం. అప్పట్లో కలుపు తీసేందుకు కూలీలకు ఎక్కువ డిమాండ్ ఉండేది. ఇప్పుడు వర్షాలు కురవకపోవడంతో ఊరంతా కలిపినా 10 కుటుంబాలు కూడా వేరుశనగ సాగు చేయడం లేదు. ప్రకృతి ప్రభావం ఇలాగే ఉంటే రాను రాను వేరుశనగ సాగు కష్టమే. దేవుడి మీద భారం వేసి 3 ఎకరాలు వేరుశనగ సాగు చేశాను. 45 రోజులు గడిచింది. ఒకసారి గడ్డి కలుపు తీశాము. ఒక ఎకరాకు 20 నుంచి 25 వేల రూపాయలు పెట్టుబడి పెట్టాము. పంట బాగా పండితే తప్ప లాభాలు రావడం లేదు.

\- బొంగా కృష్ణారెడ్డి, రైతు, గాండ్లపల్లె

'అన్నదాత సుఖీభవ'ను సద్వినియోగం చేసుకోండి : సబ్ కలెక్టర్


రైతులకు అన్నదాత సుఖీభవ పథకం చెక్కు అందిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, టీడీపీ నేతలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన పథకం కింద రైతులకు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. శనివారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలోని రైతులకు మొదటి విడతగా 20,162 మంది రైతులకు రూ.14.11కోట్లు విడుదల చేసిందన్నారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు గురుమూర్తి గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సహాయానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు వేసి మొత్తం రూ.7వేలు రైతుల ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరామ్ మాట్లాడుతూ మొదటి విడతగా రూ.7వేలు, రెండో విడత రూ.7వేలు, మూడో విడత రూ.6వేలు మొత్తం కలిపి రూ.20వేలు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏవో నవీన్‌కుమార్, టీడీపీ నేతలు విద్యాసాగర్, మధుబాబు, సిమెంట్ రమణ, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

5న పాలిటెక్నిక్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

ఓబులవారిపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓబులవరిపల్లెలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5వ తేదీన మిగిలి ఉన్న కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.దేవరాజ్ తెలిపారు. పదో తరగతి పాసైనవారు, పాలీసెట్ 2025లో రాసినవారు, రాయని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తులతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో ఈనెల 5న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. స్పాట్ అడ్మిషన్స్‌లో సీటు పొందిన అభ్యర్థులు అదేరోజు కాలేజీలో వివిధ ఫీజుల కింద రూ.5800 నగదు, ఒరిజనల్ సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. స్పాట్ అడ్మిషన్‌లో సీట్లు పొందినవారికి ఎటువంటి స్కాలర్‌షిప్ రావని ప్రిన్సిపాల్ తెలిపారు.

లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి

● పోలీసులకు ఫిర్యాదు చేసిన వివాహిత

పీలేరు రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని ఓ వివాహిత శనివారం పీలేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు... పీలేరు మండలంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వివాహితకు ఇద్దరు కుమార్తెలు. తన భర్త ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ క్రమంలో ముడుపులవేముల పంచాయతీ రాణావడ్డిపల్లెకు చెందిన యల్లమంద శ్రీనివాసులు తనను మానసికంగా, లైంగికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త చనిపోక మునుపు సైతం తమ ఇంటికి వచ్చి లైంగికంగా వేధించేవాడని, తన భర్త చనిపోవడానికి ఇతనే కారణమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈనెల 1వ తేదీన శుక్రవారం రాత్రి సుమారు 7గంటల ప్రాంతంలో తన ఇంటికి వచ్చి పనుల విషయమై మాట్లాడాలని పిలిచి తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని, గట్టిగా అరవడంతో అత్తమామ అనసూయ, రమణయ్య, మరికొందరు అతని బారి నుంచి కాపాడారని తెలిపారు. ఈ విషయమై రాణావడ్డిపల్లె ఆలయం వద్ద జరిగిన పెద్దమనుషుల పంచాయితీలోనూ తనతో దురుసుగా ప్రవర్తించడంతో అతనికి దేహశుద్ధి చేశారని తెలిపారు. తనను మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్న శ్రీనివాసులు నుంచి రక్షణ కల్పించాలని కోరగా విచారించి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

సుండుపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రమాదానికి గురైన గోవిందు రామయ్య (39) శనివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. శుక్రవారం రాయచోటి నుండి స్వగ్రామం రాయవరం గ్రామ పంచాయతీ కావలిపల్లికి వెళ్తుండగా సుండుపల్లి రాయచోటి ప్రధాన రహదారి రాచంవాండ్లపల్లె క్రాస్ వద్ద ద్విచక్రవాహనం నుండి కిందపడి గాయాలపాలయ్యాడు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబీకులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వివాహిత...

బి.కొత్తకోట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొటుకు పంచాయతీ పులుసుమానిపెంటలో భర్తపై కోపంతో విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పులుసుమానిపెంటలో నివాసం వుంటున్న శివశంకర్, లక్ష్మీదేవి(42) దంపతులకు జగదీష్, రజిత సంతానం. మద్యానికి బానిసైన శివశంకర్‌తో తరచూ గొడవ పడే లక్ష్మీదేవి శుక్రవారం జీవితంపై విరక్తి చెంది ఇంట్లో వున్న విషద్రావణాన్ని తాగింది. గమనించిన స్థానికులు సమీపంలో వున్న కర్నాటక గ్రామం రాయల్పాడుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం మదనపల్లెకు, అక్కడి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. రుయాలో చికిత్స పొందుతూ లక్ష్మీదేవి శనివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి


వెంకటరత్నం మృతదేహం

కలకడ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాతిగుంటపల్లి పంచాయతీ లక్ష్మీపురం సమీపంలో శనివారం రాత్రి అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇరువురికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామాంజనేయులు వివరాల మేరకు.. దేవళపల్లికి చెందిన డ్రైవర్ నాగరాజనాయుడు, కూలీలు అదే గ్రామం దిగువ దళితవాడ వాసి వెంకటరత్నం (36), గుర్రంకొండ మండలం మర్రిమాకులపల్లిక నరసింహులు (52) ట్రాక్టర్‌లో ఓ రైతుకు టామోట కట్టెలను తోలుకు వస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో లక్ష్మీపురం సమీపంలోకి రాగానే అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడటంతో ట్రాలీలో కట్టెలపై కూర్చొని వున్న వెంకటరత్నంపై లోడు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయలపాలైన డ్రైవర్ నాగరాజనాయుడు, నరసింహులును చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య గంగులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన మునస్వామి శెట్టి

రామసముద్రం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కర్ణాటక సరిహద్దులోని పెగలపల్లికి చెందిన మునస్వామిశెట్టి(62) మండలంలోని గెవి తిమ్మరాయస్వామి ఆలయానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో రామసముద్రం-పుంగనూరు రోడ్డు మార్గంలో గాంధీనగర్ వద్ద ఉన్న గుంతను తప్పించబోయి కిందపడ్డాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదానికి కారణమైన గుంతకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

పర్యాటకుల రక్షణకే ప్రాధాన్యం

● హార్సిలీహిల్స్‌పై డీఎస్పీ ముమ్మర తనిఖీలు ● శాంతిభద్రతలపై కీలక ఆదేశాలు


గాలిబండపై పరిశీలిస్తున్న పోలీసు బృందం


రిసెప్షన్‌లో విచారిస్తున్న డీఎస్పీ మహేంద్ర

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బి.కొత్తకోట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్ పరిధిలో పర్యాటకుల రక్షణకే ప్రాధాన్యత ఉంటుందని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మండలం పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై డీఎస్పీ మహేంద్ర 50మంది పోలీసు సిబ్బందితో శనివారం తనిఖీలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పోలీస్ భవనానికే దిక్కులేదు.. పర్యాటకుల రక్షణ ఎలా? అనే శీర్షికన వెలువడిన వార్తాకథనానికి ఆయన స్పందించారు. ఇద్దరు సీఐలు, 5మంది ఎస్‌ఐలతో సహా 50మంది సిబ్బందితో హార్సిలీహిల్స్ మొత్తాన్ని జల్లెడ పట్టారు. ఏపీ టూరిజం రిసార్ట్స్, హోటళ్లు, ప్రైవేటు లాడ్జీ లను పరిశీలించి రూములు అద్దెకు ఇచ్చే సమయంలో పర్యాటకుల నుంచి తగిన ఆధారాలు తీసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వరాదని హెచ్చరించారు. వ్యూపాయింట్ వద్ద జాగ్రత్తగా వుండాలని, ద్విచక్రవాహనాలలో కొండపైకి వచ్చేవారు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పోలీసు హెల్ప్‌డెస్క్ భవనం దుర్వినియోగం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత కారణంగా హెల్ప్‌డెస్క్‌లో పోలీసులను రెగ్యులర్‌గా పెట్టలేకపోయామని, ఇకపై అందుబాటులో వుండేలా చూస్తామన్నారు. ప్రైవేటు రెస్టారెంట్ల యాజమాన్యం నిబంధనల మేరకు నిర్వహించుకోవాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట స్థానిక సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు, సిబ్బంది వున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

వాల్మీకిపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని వాల్మీకిపురం మండల డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ అన్నారు. శనివారం నమాజ్ కట్టవీధి ఉర్దూ పాఠశాలలో పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1000మంది బాలురకు 926 మంది బాలికలు ఉన్నారన్నారు. ఆడపిల్ల అయినా మగ బిడ్డ అయినా సమానంగా చూడాలన్నారు. గర్భిణి సమయంలో స్కానింగ్ కేవలం పిండం ఆరోగ్య పరిస్థితి కోసమేనని, ఈ విషయాన్ని తల్లులు గమనించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అమృత, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ

దొడ్డిపల్లె వెల్‌నెస్ సెంటర్ తనిఖీ

పీలేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): దొడ్డిపల్లెలోని వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ (డీపీహెచ్‌ఎన్‌ఓ) శోభాలత, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ మునీశ్వర్ వెల్‌నెస్ సెంటర్‌లోని గర్భిణుల నమోదు, హిమోగ్లోబిన్, కాన్పులు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ తదితర రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం శివరామాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాల కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి పోషక విలువలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రేగళ్లు వైద్యాధికారి రాధామాధవి, హెచ్‌ఈ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ చిన్నప్ప, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోయకొండమ్మకు కుంకుమార్చన

సుండుపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బోయకొండమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మొదటి రోజు శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకం, కుంకుమార్చన నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం నుండి మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారంతో ముగుస్తాయన్నారు. అందులో భాగంగా శనివారం గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

పులివెందుల జడ్పీటీసీని గెలుస్తాం

● ఐకమత్యంతో ముందుకు సాగుతాం : ఎమ్మెల్యే ఆది ● కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత : బీటెక్ రవి


విలేకరులతో మాట్లాడుతున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

పులివెందుల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ గెలుస్తుందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. శనివారం పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో మండలంలోని ఆరు పంచాయతీల నాయకులతో పంచాయతీల వారీగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల్లో జగన్‌రెడ్డి కనీసం పులివెందులను కూడా అభివృద్ధి చేయలేని స్థితిలో పాలన సాగించారన్నారు. ప్రజలకు అవసరమైన పనులు కూడా చేయలేకపోయారన్నారు. ఈరోజు ఆయా పంచాయతీల నాయకులతో మాట్లాడుతుంటే అనేక సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. 600 రోజుల క్రితం నేను పులివెందులకు వచ్చానన్నారు. అప్పటికి ఇప్పటికి ఎంతో మార్పు వచ్చిందన్నారు. వైఎస్ జగన్, అవినాష్‌రెడ్డి చేసిన తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అడుగుతామన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసు తమపై పెట్టేందుకు ప్రయత్నించారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి వైసీపీ చేస్తున్న తప్పులను వివరిస్తామన్నారు. పోలీసులకు, మాకే పోటీ అని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అంటున్నారని, టీడీపీ, కాంగ్రెస్, స్వతంత్రులు తదితరులు నామినేషన్ దాఖలు చేసి పోటీలో ఉన్నారని, దీంతో ఆయన చెప్పినట్లు ఇక్కడ సాగదన్నారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలుపొందేందుకు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడుగుతామన్నారు. ఈరోజు పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి పార్టీలోకి రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎన్నో ఏళ్లుగా ఒక కుటుంబాన్నే ఆదరిస్తున్నారన్నారు. రైతులు సాగుచేసే సమయంలో పంట మార్పిడి చేసే విధంగా ఇక్కడ కూడా ఈ పద్ధతి తేవాలన్నారు. అనంతరం పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ 2006 వరకు నేను టీడీపీలోనే ఉండేవాడినని, అప్పుడు సతీష్‌రెడ్డి వ్యవహారశైలి నచ్చక కాంగ్రెస్‌లో చేరానన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలోకి వచ్చానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పోరెడ్డి ప్రభాకరరెడ్డి, హెచ్‌ఎల్‌సీ ఛైర్మన్ జోగిరెడ్డి, రఘునాథరెడ్డి, వెంకటరామిరెడ్డి, పుష్పనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


మోర్‌సింగ్ కుటుంబీకులకు ఆర్థికసాయం అందిస్తున్న టీఎన్‌టీయూసీ నేతలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డులో ప్రమాదవశాత్తు లారీ ఢీకొని మృతి చెందిన కూలీ కుటుంబానికి టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రూ.2లక్షల ఆర్థికసాయం అందించింది. ఈ మేరకు శనివారం స్థానిక మార్కెట్‌యార్డులో నగదును అందించారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్ మాట్లాడుతూ మార్కెట్‌లో లారీ వెనక్కి వస్తుండగా కూలీగా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మోర్‌సింగ్ లారీ ఢీకొని గత నెలలో మృతి చెందాడన్నారు. అప్పట్లోనే హమాలి వర్కర్స్ స్పందించి మోర్‌సింగ్ భౌతికకాయాన్ని ఉత్తరప్రదేశ్‌కు పంపారన్నారు. టీఎన్‌టీయూసీ ముందుకొచ్చి హమాలీ యూనియన్, మండీ వర్కర్స్, వ్యాపారులు, లారీ వర్కర్స్ యూనియన్ కలసి రూ.2లక్షల నగదు సేకరించామని, ఈ మొత్తాన్ని మోర్‌సింగ్ కుటుంబీకులకు అందించామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రామయ్య, ఉపాధ్యక్షుడు రసూల్, కార్యదర్శి మహబూబ్‌బాషా, మురాషా, షామీర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

పీలేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ సభ్యులు తప్ప ఇతరులకు పాఠశాలల్లో ప్రవేశం లేదంటూ విద్యాశాఖ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరించేలా విద్యాశాఖ ఉత్తర్వులు ఉన్నాయన్నారు. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు విద్యాసంస్థల్లో జరిగే అన్యాయాలను బహిర్గతం కాకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడే విద్యార్థి సంఘాలకు ఇలాంటి ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఆ ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే రాష్ట్రంలోని అన్ని విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి ఉద్యమిస్తామన్నారు.

గురుకులంలో సీట్ల భర్తీకి ఆహ్వానం

వాల్మీకిపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కొత్త ఇందిరమ్మ కాలనీలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డీహెచ్ చంద్రకళ పేర్కొన్నారు. ఎస్సీ విభాగానికి మిగులు సీట్లు ఖాళీ ఉన్నాయని విద్యార్థులు సద్వియోగం చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో 25ఖాళీలు, 7వ తరగతిలో 3ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత గల విద్యార్థులు ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుల సమాచారంతో నేరుగా పాఠశాలలో సంప్రదించాలన్నారు.

లారీ, ఆటో ఢీ : ఒకరి మృతి

● ఐదుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన ఆటో

రాజంపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం బోయనపల్లె సమీపంలో శనివారం లారీ, ఆటో ఢీకొన్న సంఘటనలో రాజంపేట పట్టణం రామ్‌నగర్‌లో నివాసం ఉండే నాగారం లక్ష్మీదేవి(46) మృతి చెందగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ వివరాల్లోకి వెళితే... నందలూరులో సౌమ్యనాథస్వామిని దర్శించుకుని రాజంపేటకు వస్తున్న ఆటోను తిరుపతి నుంచి కడప వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో రామ్‌నగర్‌కు చెందిన నాగారం దివ్య, ఓబులవారిపల్లెకు చెందిన తోట గగన్, మౌనిక, వెంకటరమణ, శేషమాంబపురానికి చెందిన సాంబయ్యకు తీవ్ర గాయలయ్యాయి. ఈ మార్గంలో వెళుతున్న ఏఎస్పీ రామ్‌నాథ్ హెగ్డే ప్రమాద సంఘటనను గమనించి వెంటనే గాయపడిన వారిని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నారు.

వైవీయూలో ఇన్‌చార్జ్‌ల పాలనకు త్వరలో విముక్తి


యోగివేమన యూనివర్సిటీ

- కొత్త వీసీ నియామకానికి ప్రభుత్వం సన్నాహాలు
- సెర్చ్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఇన్‌చార్జిల పాలనకు త్వరలో విముక్తి కలగనుంది. వైస్ చాన్సలర్ నియామకానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో సెర్చ్ కమిటీని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో యోగివేమన యూనివర్సిటీలో గత సంవత్సరం కాలం నుంచి ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌లను నియమించింది. 2024 జూలై 19న ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి నియమితులయ్యారు. సుమారు 7 నెలలపాటు ఇన్‌చార్జి పాలన కొనసాగింది. విశ్వవిద్యాలయంలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రెగ్యులర్ వీసీగా సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ప్రజితి ప్రకాష్‌బాబును నియమించింది. అయితే ఆయనను పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వీసీగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రకాష్‌బాబును రిలీవ్ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు విక్రమ్‌సింహపురి యూనివర్సిటీ వీసీగా పనిచేస్తున్న ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును వైవీయూ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్‌గా నియమిస్తూ గవర్నర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ మార్చి 16వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి నుంచి మళ్లీ ఇన్‌చార్జిపాలనలో యోగివేమన యూనివర్సిటీ కొనసాగుతోంది.

ప్రస్తుతం సెర్చ్ కమిటీని ప్రభుత్వం నియమించడంతో వైవీయూ రెగ్యులర్ వీసీ మరో పది రోజుల్లో వచ్చే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

సెర్చ్ కమిటీ నియామకం

వీసీల ఎంపికకు సెర్చ్ కమిటీ సూచనలు ఇస్తుంది. ఈ నేపథ్యంలో ఈనెల 30వ తేదీ సెర్చ్ కమిటీ సభ్యులను నియమిస్తూ ప్రిన్సిపాల్ సెక్రటరీ కోన శశిధర్ ఉత్తర్వులు విడుదల చేశారు. సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులుంటారు. యూజీసీ తరఫున సర్దార్‌పటేల్ యూనివర్సిటీ విశ్రాంత వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దేవదత్‌శర్మ నియమితులయ్యారు. ప్రభుత్వం తరఫున ఆదికవి నన్నయ యూనివర్సిటీ విశ్రాంత వీసీ ప్రొఫెసర్ పి.జార్జ్ విక్టర్‌ను, వర్సిటీ పాలకమండలి తరఫున రాయలసీమ యూనివర్సిటీ విశ్రాంత వీసీ ప్రొఫెసర్ కేవీ ప్రసాద్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి.. ఆచార్యుల అనుభవం, నైపుణ్యాలు, పరిశోధనలు, ప్రచురణలు తదితర అంశాలను పరిశీలించి ఉన్నత విద్యామండలికి సూచనలు ఇస్తారు. అనంతరం గవర్నర్ ఉపకులపతులను నియమిస్తారు. ఈ నియామకాలు మరో వారంలోగా పూర్తిచేసే అవకాశం ఉందని వర్సిటీ అధికారులు, ఆచార్యులు భావిస్తున్నారు.

ముమ్మర ప్రయత్నాలు

వీసీ పదవుల కోసం వైవీయూలో పలువురు ప్రొఫెసర్లు దరఖాస్తు చేశారు. ఇందులో కొందరు రిటైర్డ్ ప్రొఫెసర్లు కూడా ఉన్నట్లు సమాచారం. వైస్ చాన్సలర్ పదవి దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. సుమారు పదుల సంఖ్యలో ఆశావహులు ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా మరో పది రోజుల్లో రెగ్యులర్ వైస్ చాన్సలర్ నియమితులయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం తెలియజేస్తున్నారు.

నిరాధార ఆరోపణలతో విశ్వవిద్యాలయ ప్రతిష్టను దిగజార్చవద్దు

యోగివేమన విశ్వవిద్యాలయ అధ్యాపక సంఘం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నిరాధార ఆరోపణలతో విశ్వవిద్యాలయ ప్రతిష్టను దిగజార్చవద్దని యోగివేమన విశ్వవిద్యాలయ అధ్యాపక సంఘం అధ్యక్షుడు ఆచార్య ఎ.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎం.వినోదిని సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్‌గా ఉన్న ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు వ్యక్తిత్వాన్ని హననం చేసే విధంగా నిందలు మోపడం తగదన్నారు. విశ్వవిద్యాలయంలో కాన్వకేషన్ నిర్వహించడానికి రెండేళ్ల క్రితం ప్రొఫెసర్ చింతా సుధాకర్ ఉప కులపతిగా ఉన్న సమయంలో నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. సుమారు 13000 మంది విద్యార్థులు ఒరిజినల్ డిగ్రీ కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. విద్యా ఉద్యోగ అవకాశాల కోసం ఈ పట్టాల అవసరం ఉందని విద్యార్థులు పదేపదే అధికారులకు విన్నవిస్తున్న నేపథ్యంలో కాన్వకేషన్ వెంటనే జరపాలని విశ్వవిద్యాలయం నిర్ణయించిందన్నారు. అందుకు అనుగుణంగానే విశ్వ విద్యాలయం పనులు ప్రారంభించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున కాన్వకేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కాన్వకేషన్ నిర్వహణకు అవసరమైన జర్మన్ షెడ్లు వేయడానికి, గోల్డ్ మెడల్స్ తయారు చేయించడానికి ఇ-టెండర్ల ద్వారా కొటేషన్స్ కోరడానికి నిర్ణయం తీసుకున్నారని తెలియజేశారు. వీటిలో ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పాత్ర ఏమాత్రం లేదని, స్వలాభం కోసం పక్షపాత దృష్టితో కొంతమంది పనిగట్టుకొని విశ్వవిద్యాలయ అధికారుల మీద బురదజల్లాలని ప్రయత్నించినట్లు తెలుస్తోందన్నారు.

వైవీయూ డిప్లమో కోర్సుల ప్రవేశాల గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో పోస్టుగ్రాడ్యుయేషన్ డిప్లమో కోర్సులలో ప్రవేశానికి ఈనెల 11వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు యూనివర్శిటీ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ టి.లక్ష్మిప్రసాద్ తెలిపారు. జర్నలిజంశాఖ ఆధ్వర్యంలో పీజీ డిప్లమో ఇన్ పబ్లిక్ రిలేషన్ (పీజీడీపీఆర్), పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ తెలుగు జర్నలిజం (పీజీడీటీజే), ఫైన్ ఆర్ట్స్‌శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోర్సులలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు అన్ని రకాల అర్హత పత్రాలతో నేరుగా విశ్వవిద్యాలయంలో హాజరు కావాలని సూచించారు. సాయంకాలం తరగతులు కావడం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ఇతర వృత్తుల్లో ఉన్న వారు, పీజీస్థాయి కోర్సులు చదువుతున్న వారు కూడా ఇందులో ప్రవేశం పొందవచ్చన్నారు. వివరాలకు యోగివేమన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీలో పీజీ కళాశాలలోని ఎంబీఏ విభాగానికి గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం కోసం ఈనెల 5వ తేదీ ఉదయం 11గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిసున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్ అలైడ్ బ్రాంచెస్), ఎంసీఏ, ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) అర్హతల కలిగి ఉండాలన్నారు. ఎంబీఏ విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ పేపర్లను, అనుబంధ అంశాలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ప్రోగ్రామింగ్ ఇన్ ఆర్, మిషన్ లెర్నింగ్, ఐఓటీ, సైబర్ సెక్యూరిటీ, డేటావేర్ హౌసింగ్ అండ్ మైనింగ్, బిజినెస్ అనలిటిక్స్, పవర్ బీఐ, డీబీఎంఎస్, డేటా విజువలైజేషన్‌లలో బోధించేవారు కావాలన్నారు. అర్హత ఉన్న ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో నేరుగా ప్రిన్సిపాల్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. రెండు పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు.

ఆర్‌ఎస్‌కేలో రూ.4.70 లక్షలు స్వాహా

- పోలీసు ఫిర్యాదుకు అధికారుల సన్నద్ధం

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరు రైతు సేవా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివశంకర్ సుమారు రూ.4.70 లక్షలు స్వాహా చేశారు. గత రబీ సీజన్ చివరి దశలో కల్లూరు రైతు సేవా కేంద్రానికి సరఫరా అయిన ఎరువులు, విత్తనాలను రైతులకు అందించి ఆ మొత్తాలను వసూలు చేశారు. ఈ సొత్తును ప్రభుత్వానికి చెల్లించకుండా సొంత ప్రయోజనాలకు వాడుకున్నారు. స్వాహా చేసిన మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించకుండా ఇటు విధులకు హాజరుకాకుండా జనవరి నెల నుంచి తప్పించుకుని తిరుగుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. అప్పట్లో ఈ విషయంపై స్థానిక వ్యవసాయ అధికారులకు తెలిసి పలుమార్లు హెచ్చరించినా అదిగో కడుతాను. ఇదిగో కడుతాను అంటూ విధులకు హాజరవ్వడం మానుకున్నాడు. ఈ విషయమై ప్రస్తుత వ్యవసాయశాఖ అధికారి వరహరి కుమార్‌ను వివరణ కోరగా.. తాను ఇక్కడకు రాకముందే చోటు చేసుకున్న నగదు స్వాహా విషయమై జిల్లా ఉన్నతాధికారులు గుర్తించారన్నారు. వీఏఏ శివశంకర్ గురించి వాకబు చేయగా జనవరి నుంచి విధులకు హాజరుకావడం లేదని చెప్పారు. విత్తనాలు, ఎరువుల డబ్బులను సుమారు రూ.4.70 లక్షలను స్వాహా చేయగా.. అతను అందుబాటులో లేకపోవడంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులను సొంత ప్రయోజనాలకు వాడుకున్న వైనంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏవో వివరించారు.

నల్సాపథకంపై శిక్షణ, ఓరియంటేషన్ కార్యక్రమం


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ యామిని

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కడప న్యాయసేవ సదన్‌లో శనివారం నల్సాపథకం-2025పై జిల్లా ప్రధాన జడ్జి, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఛైర్మన్ డాక్టర్ సి.యామిని అధ్యక్షతన జిల్లా జాగృతి యూనిట్ సభ్యులకు శిక్షణ, ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. న్యాయ సహాయం పొందడంలో సవాళ్లు, న్యాయ సహాయం కోసం చట్టపరమైన అవగాహన, ప్రాముఖ్యత, ప్రస్తుత చట్టపరమైన నిబంధనలు, స్థానిక సంస్థల ద్వారా న్యాయసహాయం అవగాహనను సంస్థాగతీకరించడానికి ఒక పథకం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పథకం లక్ష్యాలు, జిల్లా తాలూకా యూనిట్ల స్థాపన, చట్టపరమైన అవగాహన వ్యాప్తి విధానం, న్యాయసేవల ప్రదాతలు, సంస్థల బాధ్యతలు, నివేదిక, పర్యవేక్షణ, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జిలు గరికపాటి దీనబాబు, ఎన్.శాంతి, జి.రమేష్‌కుమార్, ఎస్.బాబాఫకృద్దీన్, రాజంపేట అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే, కడప డీఎస్‌పీ వెంకటేశ్వర్లు, కడప అడిషనల్ మున్సిపల్ కమిషనర్ కె.రాకేష్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వపాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా అడ్మిషన్లు

వేంపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా అడ్మిషన్ పొందవచ్చని ఆ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సుల్లో సీట్లు మిగిలి ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు పాలిసెట్ పరీక్షల్లో ర్యాంకు రాకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సీటుకోసం వచ్చే విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంట తీసుకురావాలని, ఫీజు కేవలం ఏడాదికి రూ.6వేలు అని తెలిపారు. వివరాలకు 9010222172, 9490378886 నెంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

జోనల్ త్రో బాల్‌లో సత్తా చాటిన హెచ్‌పీఎస్


విద్యార్థులతో కరచాలనం చేస్తున్న రామసుబ్బారెడ్డి

కడప స్పోర్ట్స్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కడప నగర రిమ్స్ సమీప హైదరాబాదు పబ్లిక్ స్కూలులో శనివారం జరిగిన ఏపీ, తెలంగాణ ఆరు జోన్లకు చెందిన జోనల్ త్రో బాల్ టోర్నమెంటులో హైదరాబాదు పబ్లిక్ స్కూలు విద్యార్థులు సత్తాచాటారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీయూ భౌతిక శాస్త్ర విభాగాధిపతి స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి రామసుబ్బారెడ్డి హాజరై తొలుతక్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం జరిగిన అండర్ 17 బాలికల విభాగంలో జోన్‌బీ హైదరాబాదు పబ్లిక్ స్కూలు (కడప జట్టు) మొదటిస్థానం సాధించి స్వర్ణపతక విజేతగా నిలిచింది. అలాగే అండర్ 14 బాలికల విభాగంలో జోన్ బీ హైదరాబాదు పబ్లిక్ స్కూలు కడప జట్టు కాంస్య పతకం అందుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమిత్‌సింగ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో పెరుగుతున్న నీటిమట్టం

కొండాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయిర్ నుంచి కృష్ణా జలాలు వస్తుండటంతో గండికోట ప్రాజెక్టులో రోజురోజుకు నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. శనివారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 9,000 క్యూసెక్కులు ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా గండికోట నుంచి మైలవరం జలాశయానికి 1500 క్యూసెక్కులు, సీబీ ఆర్‌కు 1,000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 300 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 600 క్యూసె క్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 10.4 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.

నేటి నుంచి స్పెల్-2 ఇన్ సర్వీస్ శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ నిత్యానందరాజులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పీజీటీలకు ఆదివారం నుంచి ఐదురోజుల పాటు స్పెల్-2 ఇన్ సర్వీస్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.నిత్యానందరాజులు పేర్కొన్నారు. శనివారం కడప నగరం సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగర పరిధిలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో కేజీబీవీ పీజీటీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ) సబ్జెక్టు టీచర్లకు స్పెల్-2 ఇన్ సర్వీస్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఈనెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 119 మంది ఫిజిక్స్ పీజీటీలు, 119 మంది కెమిస్ట్రీ పీజీటీలు, 21 మంది రిసోర్స్ పర్సన్లు శిక్షణ తరగతులకు హాజరవుతున్నట్లు చెప్పారు. శిక్షణ తరగతులను అధికారులు పర్య వేక్షించాలని సూచించారు. సూపరింటెండెంట్ ప్రేమకుమారి, జీసీడీఓ రూత్‌ఆరోగ్యమేరి, ఏఎంఓ వీరేంద్రయాదవ్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

వెల్లాల చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు


చెన్నకేశవస్వామి, శ్రీదేవి భూదేవిల గ్రామోత్సవం

రాజుపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసోత్సవంలో భాగంగా రెండో శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాలో చెన్నకేశవ, శ్రీదేవి భూదేవిల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివార్ల గ్రామోత్సవం మహిళలు భజనల మధ్య కోలాహలంగా సాగింది. అదేవిధంగా సంజీవరాయస్వామికి తమలపాకులతో ప్రత్యేక అలంకరణ గావించి పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో దేవస్థానం కిటకిటలాడింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


చెల్లాచెదురుగా పడిన బొలెరో వాహనంలోని మామిడిపండ్లు

సీకేదిన్నె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలో జమాల్‌పల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... లక్కిరెడ్డిపల్లె నుంచి కడపకు మామిడి పండ్ల లోడుతో వస్తున్న బొలెరో వాహనం ఆగి ఉన్న లారీని వెనుక వైపు ఢీకొంది. దీంతో పఠాన్ మౌలాలి, నూర్‌బీ అనే ఇరువురు తీవ్రగాయాలతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి హైడ్రాలిక్ కట్టర్‌తో క్యాబిన్ తొలగించి బయటికి తీసి చికిత్స నిమిత్తం 108 ద్వారా రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం



దువ్వూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు గ్రామం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆకుల నాగజ్యోతి(27) శనివారం ఉదయం నుంచి కనిపించడం లేదు. ఈమేరకు ఆమె భర్త హరి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాలనీ సమీపంలో ఉన్న కేసీ కాలువ వద్ద ఆమె ధరించిన చున్నీ కనిపించడంతో ఆత్మహత్యకు ఏమైనా పాల్పడిందా అనే కోణంలో విచారిస్తున్నట్లు ఏఎస్‌ఐ భూషణం తెలిపారు. ఆమె అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు భర్త పోలీసులకు తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ మెస్‌లు అక్షయపాత్రకు అప్పగింత

- 24వేల మంది విద్యార్థులకు భోజనం సరఫరా
- ఇడుపులపాయలో పరిశీలించిన అక్షయపాత్ర ప్రతినిధులు

వేంపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో చదువుతున్న 24వేల మంది విద్యార్థులకు ఇక నుంచి అక్షయపాత్ర సంస్థ ద్వారా భోజనం అందించనున్నారు. ప్రభుత్వ సూచన మేరకు ఆర్జీయూకేటీ అధికారులు అక్షయపాత్రకు ఎల్‌ఓసీ ఇచ్చారు. ఇడుపులపాయలో 4, నూజివీడులో 4, శ్రీకాకుళంలో 2, ఒంగోలులో 2 మెస్‌లను త్వరలో అక్షయపాత్ర ద్వారా నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు వివిధ కంపెనీల ద్వారా నిర్వహించేవారు. పలు సందర్భాల్లో విద్యార్థులు భోజనం నాణ్యంగా ఉండడం లేదని ఫిర్యాదులు, ఆందోళనలు చేశారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మెస్‌లను అక్షయపాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌లను కలిసి విన్నవించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ప్రభుత్వ పెద్దలు అక్షయపాత్రకు అప్పగించాలని సూచించారు. ఈ మేరకు 12 మెస్‌లను నిర్వహించేందుకు అనుమతి ఇచ్చారు. 15 రోజుల్లోగా ట్రిపుల్‌ఐటీలోని మెస్‌లను అక్షయపాత్ర స్వాధీనం చేసుకొని భోజనం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలోని మెస్‌లను అక్షయపాత్ర ప్రతినిధులు శనివారం పరిశీలించారు. విద్యార్థులకు భోజనం అందించేందుకు ఎలాంటి సౌకర్యాలు,వసతులు ఉండాలన్న విషయాలపై పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ట్రిపుల్‌ఐటీ అధికారులతో చర్చించారు. అక్షయపాత్ర ద్వారా శాఖాహారభోజనం మాత్రం అందిస్తుండగా మాంసాహార భోజనాన్ని అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులను భాగస్వామ్యం చేయడమా లేక కాంట్రాక్టు సంస్థకు అప్పగించాలనే విషయంపై చర్చించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ట్రిపుల్‌ఐటీ అధికారి ఒకరు తెలిపారు.



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలోని మెస్-2 వద్ద విద్యార్థినులు

అన్నంలో పురుగులొస్తున్నాయి..

- ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల ఆవేదన... నిరసన

వేంపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నం సక్రమంగా ఉండడం లేదు...ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారు.. ఒక్కోసారి పురుగులు వస్తున్నాయి... ఎలా తినాలంటూ ట్రిపుల్‌ఐటీలో పీయూసీ చదువుతున్న విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ పాత క్యాంపస్‌లో జైస్వాల్ కంపెనీ ఆధ్వర్యంలో మెస్ నిర్వహిస్తున్నారు. ఓల్డ్ క్యాంపస్‌లో ఉన్న పీయూసీ బాలికలకు, కొత్త క్యాంపస్‌లో ఉన్న పీయూసీ బాలురకు భోజనం సరఫరా చేస్తారు. కొత్త క్యాంపస్‌లో ఉన్న పీయూసీ విద్యార్థులు శనివారం రాత్రి హాస్టల్ గదుల నుంచి బయటకు వచ్చి నిరసన తెలిపారు. రోడ్డుపై బైఠాయించి నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. ట్రిపుల్‌ఐటీ ఉద్యోగులు అక్కడకు చేరుకొని సరైన భోజనం అందేలా చూస్తామని సర్ది చెప్పడంతో నిరసన విరమించినట్లు ఏఓ పెనుగొండ రవికుమార్ తెలిపారు.


GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC, YSR Kadapa District

Tenders are invited on e-procurement **Short Tender Notice NIT No. 1 and 2 /EE/APEWIDC/DM/Kdp/2025-26 dt. 2.08.2025.**

Down loading commencement on 04.08.2025 and closing date may be viewed in e-Procurement.gov.in

For further details can be viewed at https://tender.apeprocurement.gov.in or contact cell : 91339 94901

Executive Engineer
APEWIDC, YSR Kadapa District



వెంటనే కావలెను

కడప మురళీ ఫర్నిషింగ్ & హ్యాండ్లూమ్స్ నందు పనిచేయుటకు లేడీస్ & జంట్స్ కావలెను. జీతం : లేడీస్-8000 to 15000, జంట్స్ - 10000 to 15000 వరకు అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత, సంప్ర : వైవిస్మీల్డ్ (జి.ఎం. స్ట్రీట్) సెల్ : 94409 56331, 95733 08331

Ajc-233177

కావలెను

నెల్లూరు జిల్లా రాపూరు టౌన్ నందు గల సినిమా హాల్ నందు పనిచేయుటకు స్త్రీ/పు సిబ్బంది కావలెను. జీతం:10,000/- నుంచి 15,000/-. సం.ప్ర. సెల్: 99494 03047

AJR-240614

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: **7382114647.**

AJA- 237932

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

CHANGE OF NAME & D.O.B.

I NAGADASARI SHARADAMANI, W/O LATE SUB N VIJAYA BHASKAR, SERVICE NO JC276783F, D.NO.6-2-421-1, SUMITRA NAGAR, BADVEL (VI,PO), GOPAVARAM (M), KADAPA DIST, ANDHRA PRADESH, 516227. HUSBAND ARMY RECORD MY NAME AND D.O.B. MENTION AS SARADA MANI AND D.O.B. 05-06-1981. INSTEAD OF NAGADASARI SHARADAMANI, AND D.O.B. 01-01-1981. VIDE AFFIDAVIT DATED 02-08-2025. BEFORE THE NOTARY PUBLIC (GOVT. OF A.P.)

AJC-233297

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

కేఎస్‌ఆర్‌ఎంలో ప్రాక్టీస్ మ్యాచ్


ఐపీఎల్ ప్లేయర్స్, స్పాన్సర్స్‌ను ఆహ్వానిస్తున్న కందుల చంద్ర ఓబుళరెడ్డి (నాని)

సీకేదిన్నె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8 నుంచి 23 వరకు ఆంధ్రా ప్రీమియర్లీ వైజాగ్‌లో జరుగనున్న నేపథ్యంలో శనివారం కేఎస్ఆర్ఎం కళాశాలలో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టుతో ప్రాక్టీస్ మ్యాచ్‌ను నిర్వహించినట్లు కేఎస్ఆర్ఎం విద్యాసంస్థల ఎండీ డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి తెలిపారు. ఆర్వోఆర్ జట్టు కోచ్ పైడికాల్వ విజయకుమార్, ఐపీఎల్ ప్లేయర్స్ షేక్ రషీద్, అవినాష్, గిరినాథ్‌రెడ్డి, జట్టు స్పాన్సర్స్‌ను ఆహ్వానించి అభినందించారు. 20 ఓవర్ల మ్యాచ్‌లో ఆర్వోఆర్ ,కేఎస్ఆర్ఎం జట్లమధ్య హోరాహోరీగా జరిగింది. మ్యాచ్‌ను తిలకించేందుకు అభిమానులు వచ్చారు.

కార్పొరేషన్ సిబ్బందిపై క్రిమినల్ కేసులు బనాయించాలి

బీజేపీ నాయకులు


నిరసన తెలుపుతున్న నాయకులు

కడప మారుతీనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత చెత్త పన్ను వసూళ్లు చేయవద్దని ప్రభుత్వం ఆదేశించినా బేఖాతరు చేస్తూ కడప నగరంలోని పలు అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, రెస్టారెంట్లు చికెన్ సెంటర్లు ,బార్లు, క్లినిక్‌లు, వైద్యశాలలు, లాడ్జిలు, సినిమాథియేటర్లు ఫంక్షన్‌హాళ్లతో పాటు పలు వ్యాపార సముదాయాల్లో ఇష్టానుసారంగా పన్నులు వసూలు చేసి జేబులు నింపుకున్న కార్పొరేషన్ అధికారులు, సిబ్బందిపై తక్షణమే క్రిమినల్ కేసులు బనాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలక్రిష్ణయాదవ్, సీనియర్ నాయకులు గోసుల శ్రీనివాసరెడ్డి,వీవీ చలపతి డిమాండ్ చేశారు .ఈ మేరకు శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్ అధికారులు ప్రతి ఇంటికి, వ్యాపార సముదాయాలకు చెత్త పన్నురూపంలో వసూలు చేస్తూ దండుకున్నారని ఆరోపించారు.సంబంధిత అధికారులు స్పందించి అవకతవలకు పాల్పడిన అధికారులపై చట్టపర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శాలివాహన, మల్లేశ్వర్‌రెడ్డి, జనార్దనరెడ్డి, పద్మావతిభాయి, పల్లవీ, నాగేంద్ర, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు

బళ్లారి రాఘవ మానవతా కళాప్రపూర్ణుడు

జీఎస్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ నీలమయ్య


రాఘవ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కడప కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు నాటక రంగంలో విశిష్ట సేవలు అందించి మానవతా కళాప్రపూర్ణుడు బళ్లారి రాఘవ అని ప్రతి ఒక్కరికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని జీఎస్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ నీలమయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో స్టెప్, జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బళ్లారి రాఘవ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శాంతమ్మ, స్టెప్ సీఈవో గ్రేస్, ఎల్డీఎం జనార్దన, టూరిజం మేనేజరు రామ్ కుమార్ ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కడప కల్చరల్..: దేశం గర్వించదగ్గ మహా నటుడు, రాయలసీమకు తరగని వన్నె తెచ్చిన సుప్రసిద్ధ రంగస్థల కళాకారుడు బళ్ళారి రాఘవ అని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కొనియాడారు. బళ్ళారి రాఘవ జయంతిని పురస్కరించుకుని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక రాయలసీమ కల్చరల్‌క్లబ్‌లో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత రాఘవ చిత్రపటానికి పూలమాల మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, రంగస్థల కళాకారులు డి. గంగయ్య, రామ లింగయ్య, టి. ఓబులేసు, ప్రకాష్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

శిశువులకు తల్లిపాలు ఇవ్వాలి

వేంపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శిశువులకు తప్పకుండా తల్లిపాలు ఇవ్వాలని, హెల్త్ఎడ్యుకేటర్ షఫి ఉన్నీస తెలిపారు. తాళ్లపల్లె ఆరోగ్య కేంద్రం పరధిలోని నందిపల్లె అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్ఓ రమాదేవి, నాగస్వర్ణ, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి రూ.28.78కోట్ల నిధులు


వేంపల్లిలో మాట్లాడుతున్న పీడీ రాజ్యలక్ష్మి, సీకేదిన్నె... పీఎం కిసాన్ చెక్కును రైతులకు అందిస్తున్న అధికారులు

వేంపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవపథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పులివెందుల నియోజకవర్గంలోని 41,980 మంది రైతులకు రూ.28.78కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయిందని డీఆర్‌డీఏ పీడీ, పులివెందుల ప్రత్యేక అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. వేంపల్లె మండల పరిషత్ సభాభవనంలో పీఎం కిసాన్ నిధులు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. పీఎం కిసాన్ ద్వారా రైతుకు రూ.2వేల చొప్పున రూ.7.78కోట్లు, అన్నదాత సుఖీభవ ద్వారా రూ.5వేల చొప్పున రూ.21కోట్లు జమ అవుతుందన్నారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో పెట్టుబడి కింద సద్వినియోగం చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. ఎవరికైనా పథకం అందకపోతే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం ద్వారా పథకాలు సక్రమంగా అందాలంటే ప్రతి రైతు ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్కు, మొబైల్ నెంబర్ వివరాలను అనుసంధానం చేయాలని తెలిపారు. పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏఓ శివశంకర్‌రెడ్డి, తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో కిసాన్ సమ్మాన్ నిధి

సీకేదిన్నె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల ఖాతాల్లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడత ప్రధానమంత్రి ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ప్రారంభించినట్లు కేవీకే సమన్వయకర్త వీరయ్య తెలిపారు. శనివారం ప్రధానమంత్రి కిసాన్ మ్మాన్ నిధి ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమాన్ని రైతులతో ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు ఏర్పాటు చేశారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అన్నదాతలకు ఆర్థిక చేయూత అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మూడు విడతల్లో అందించడం జరుగతుందన్నారు.

కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్, ఆత్మా పీడీ విజయలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ-1 పోస్టుల భర్తీ నిర్ణయాన్ని

ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకుడు రఘునాథరెడ్డి



ధర్నాను ఉద్దేశించిమాట్లాడుతున్న ఫ్యాప్టో పరిశీలకుడు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుచేయడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేక దొడ్డిదారిన ప్రభుత్వ యాజమాన్య స్కూల్ అసిస్టెంట్లకు ఎంఈఓ-1 పోస్టులు భర్తీ చేయడం దుర్మార్గం, తక్షణం ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకుడు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ ఎదుట రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు ధర్నా కార్యక్రమానికి జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్ఎండీ ఇలియాస్ బాష అధ్యక్షతన నిర్వహించారు. ధర్నా శిబిరానికి రాష్ట్ర పరిశీలకుడుగా విచ్చేసిన మల్లురఘు నాథరెడ్డి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధించే పరిస్థితి లేదని బోధనేతర కార్యక్రమాలు, ఉన్నతాధికారులకు నివేదికలు పంపడంలో బోధనా సమయం హరించుకుపోతోందన్నారు. 27ఏళ్లుగా ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడంతో దొడ్డిదారిన ప్రభుత్వ యాజమాన్య స్కూల్ అసిస్టెంట్లకు ఎంఈఓ-1 ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తున్నారన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్లస్ టు పాఠశాలల్లో మంజూరైన 1752 పోస్టులలో దాదాపు సగం ఖాళీగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులను నియమిం చకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు. డీఈఓ పూల్‌పండితుల సమస్య, అంతర్ జిల్లా బదిలీలు, అంతర్ యాజమాన్య బదిలీలు, తెలుగు మాధ్యమం కొనసాగింపు, హెల్త్ కార్డుల సమస్యలు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీల కొనసాగింపు, ఎంఈఓల బదిలీలు, బదిలీలలో రిలీవింగ్, పురపాలక ఉపాధ్యా యులకు జీపీఎఫ్ అమలు సమస్యలు వెంటనే పరిష్కరించాలనిహెచ్చరించారు. అనంతరం డీఆర్‌ఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు పాల్గొన్నారు.

'బాబు పర్యటనతో ఒరిగేది శూన్యం'

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ద్వారా జిల్లా ప్రజలకు ఒరిగేది శూన్యమని వైసీపీ నేతలు విమర్శించారు. శనివారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ కోర్ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ 15 నెలల్లో ప్రజలకు చేసిందేమీలేదన్నారు. ప్రతిపక్షాన్ని నిలువరించాలని తొక్కేయాలనిచూస్తున్నారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో నిబంధనలు పెట్టి వేధిస్తున్నారన్నారు. ప్రజలు వస్తుంటే కేసులు పెడదామని బెదిరిస్తున్నారని తెలిపారు. టీడీపీ నేతలు సిఫారసు చేస్తేనే ఎరువులు ఇస్తున్నారని ఆరోపించారు. బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు అమ్ముకుంటున్నారని ఆరోపించారు.రెండు జడ్పీటీసీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయని ఈ ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వంలో మాటలు తప్ప చేతలు లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణపంచాయతీ వివరాలను సక్రమంగా నమోదు చేయాలి


సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి

వేంపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీ వివరాలను సక్రమంగా నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పంచాయతీ ఉద్యోగులను ఆదేశిం చారు. వేంపల్లె పంచాయతీ కార్యాలయాన్ని శనివారం డీపీఓ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. స్వర్ణపంచాయతీ వివరాలు తప్పుల తడకగాఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేక బృందాన్ని నియమించి తప్పులను సరిచేసి వివరాలు నమోదు చేయాలని పంచాయతీ, సచివాలయ ఉద్యోగులను డీపీఓ ఆదేశించారు. త్వరితగతిన వివరాలు నమోదు చేయాలని ఆమె తెలిపారు. అనంతరం అలిరెడ్డిపల్లె పంచాయతీని ఆమె సందర్శించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీపీఓ సిబ్బందికి సూచించారు.

మహారాజశ్రీ గౌరవ ప్రథమ సీనియర్ సివిల్ జడ్జిగారు, కడప.
O.S. No. 19/2020
బూచుపల్లి రవీంద్రనాథరెడ్డి - వాది
V/s
నంద్యాల రెడ్డెప్ప మరియు 16 మంది ఇతరులు- ప్రతివాదులు
వరకు
శ్రీమతి నంద్యాల వీరమ్మ W/o లేట్ ఎస్. పెద్ద వీరయ్య, హిందూ, వయస్సు 43 సం.రాలు, డోర్ నెంబర్ 2-1-45, మెయిన్ రోడ్, పులివెందుల టౌన్, కడపజిల్లా.
పై కేసును అనగా O.S.No.19/2020 వాది అయిన బూచుపల్లి రవీంద్రనాథరెడ్డి గారు రాజశ్రీ గౌరవ ప్రథమ సీనియర్ సివిల్ జడ్జి, కడప నందు ప్రతివాదులపై వ్యాజ్యములోని షెడ్యూల్ ఆస్తి తన పేరిట అమ్మకపు అగ్రిమెంటు షరతులకు కట్టుబడి, మోసపురితముగా చేయించిన రిజిస్టర్ దస్తావేజులను రద్దు చేసి, తన పేరిట రిజిస్ట్రేషన్ చేయమని, అలా మీరు చేయని యెడల కోర్టు ద్వారా రిజిస్ట్రేషన్ పొందుటకు కేసును దాఖలు చేసి యున్నారు. అయితే 14వ ప్రతివాది అయిన మీరు కోర్టు సమన్లు తీసుకోనందున, విషయము పేపరు ప్రకటనద్వారా మీకు తెలుపుమని రాజశ్రీ ప్రథమ సివిల్ జడ్జి కోర్టు వారు ఆదేశించుతూ 18-08-2025కు వాయిదా వేసి మీకు పై కేసు నందు ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో అదే రోజున అనగా 18-08-2025వ తేదిన 10.30 ని.లకు కోర్టు నందు ఖుద్దునగాని, వకీలు ద్వారాగాని వచ్చి తెలుపుకోవలెనని లేనిచో పరోక్షమున తీర్మానించునని తెలియజేయడమైనది.
రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు
శ్రీ పి.వి. రమణారెడ్డి, వాది తరపు వకీలు

మహారాజశ్రీ గౌరవ ప్రథమ సీనియర్ సివిల్ జడ్జిగారు, కడప.
I.A. No. 173/2020 O.S. No. 19/2020
బూచుపల్లి రవీంద్రనాథరెడ్డి - పిటిషనర్/వాది
V/s
నంద్యాల రెడ్డెప్ప మరియు 16 మంది ఇతరులు
- రెస్పాండెంట్లు / ప్రతివాదులు
శ్రీమతి నంద్యాల వీరమ్మ W/o లేట్ ఎస్. పెద్ద వీరయ్య, హిందూ, వయస్సు 43సం.రాలు, డి.నెం. 2-1-45, మెయిన్‌రోడ్, పులివెందుల టౌన్, కడపజిల్లా వారికి తెలియజేయడమేమనగా పై కేసును అనగా O.S.No.19/2020 వాది అయిన బూచుపల్లి రవీంద్రనాథరెడ్డి గారు రాజశ్రీ గౌరవ ప్రథమ సీనియర్ సివిల్ జడ్జి, కడపనందు ప్రతివాదులపై వ్యాజ్యములోని షెడ్యూల్ ఆస్తి తనపేరిట అమ్మకపు అగ్రిమెంటు షరతులకు కట్టుబడి, మోసపురితముగా చేయించిన రిజిస్టర్ దస్తావేజులను రద్దుచేసి, తన పేరిట రిజిస్ట్రేషన్ చేయమని అలా మీరు చేయని యెడల కోర్టు ద్వారా రిజిస్ట్రేషన్ పొందుటకు కేసును దాఖలు చేస్తూ, ఇందులోనే I.A.No.173/2020గా పిటిషన్ దాఖలా ఆస్తిపై క్రయ విక్రయాలపై నిషేధపు ఉత్తర్వులను కోరుచూ పిటిషనర్/వాది అయిన బూచుపల్లి రవీంద్రనాథరెడ్డిగారు రాజశ్రీ గౌరవ ప్రథమ సీనియర్ సివిల్ జడ్జి, కడపనందు ప్రతివాదులపై దాఖలు చేసియు న్నారు. అయితే 14వ రెస్పాండెంట్/ప్రతివాది అయిన మీరు కోర్టు నోటీసు తీసుకోనందున, విషయము పేపరు ప్రకటనద్వారా మీకు తెలుపుమని రాజశ్రీ ప్రథమ సివిల్ జడ్జి కోర్టువారు ఆదేశించుతూ 18-08-2025కు వాయిదా వేసి మీకు పై కేసు/పిటిషన్ నందు ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో అదే రోజున అనగా 18-08-2025వ తేదిన 10.30 ని.లకు కోర్టునందు ఖుద్దునగాని, వకీలు ద్వారాగాని వచ్చి తెలుపుకోవలెనని లేనిచో పరోక్షమున తీర్మానించునని తెలియజేయడమైనది.
రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు
శ్రీ పి.వి. రమణారెడ్డి, వాది తరపు వకీలు

బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టం


చెన్నూరులో తల్లిపాల వారోత్సవాలపై నిర్వహిస్తున్న ర్యాలీ

కడప సెవెన్‌రోడ్స్ ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఎంతో శ్రేష్టమైనవని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు(1ఆగస్టు నుంచి 7 వరకు) ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కడప నందు చిన్నపిల్లల వైద్య విభాగంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున పాల్గొన్నారు. ఫైనలియర్ విద్యార్థులు తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపే నాటిక, బిడ్డల తల్లులువారి సహాయకులతో ప్రదర్శించి, పాల్గొన్న తల్లులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమలో ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ వంశీధర్ , డాక్టర్ మోహన, వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు..: తల్లిపాలు ఎంతో శ్రేష్టమని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసరు డాక్టర్ సాయచందన అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా చెన్నూరు అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. అనంతరం తల్లిపాల ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ సూపర్‌వైజరు గురమ్మ, హెల్త్ సూపర్‌వైజరు షణ్ముగం, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



అధ్వానం.. పారిశుధ్యం..!


అంగడివీధిలో చెత్తాచెదారంతో పేరుకుపోయిన కాల్వలు

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అపరిశుభ్రతకు నిలయంగా అంగడివీధి ఉంది. కడప కార్పొరేషన్ పరిధిలోని అంగడి వీధి కాల్వలు చెత్తాచెదారంతో పేరుకుపోయాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ఇక్కడ కానరావడం లేదు. అంగడివీధి 17/1 సచివాలయం పరిధిలో కాల్వలు పూర్తిగా చెత్తా చెదారంతో నిండి పోయాయి. ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలు పారవేయడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. ముక్కులు మూసుకొని రావాల్సిన దుస్థితి ఏర్పడింది. వర్షం నీరు నిల్వ ఉంటోంది. ఆయా ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు కుళ్లిపోవడం, వ్యర్థనీరు నిండి పోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు ఇక్కడ దోమల దండయాత్ర తప్పడం లేదు. కనీసం ఫాగింగ్ చేసి దోమల బెడద తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి ఈ ప్రాంత వాసులను దుర్గంధం నుంచి తప్పించాలని కోరుకుంటున్నారు.

5న జరిగే ఆందోళనను జయప్రదం చేయండి

కమలాపురం రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా ఆగస్టు 5న జరగనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు గుంటి వేణుగోపాల్ తెలిపారు. శనివారం కమలాపురంలో స్థానిక ఎంపీడీవో ఆఫీసు ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి జి.నాగేశ్వర్ రావు, ఏఐటీయూసీ నాయకురాళ్లు సుభాషిణి, మరియమ్మ, అమ్ములు పాల్గొన్నారు.

'ఆ పాఠశాలపై కేసు నమోదు చేయాలి'

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఓ బాలిక కంటి గాయానికి కారణమైన నగరంలోని ఓ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ నగర అధ్యక్షుడు గురుమోహన్‌యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి డీఈఓకు వినతిపత్రం సమర్పించారు. ఆర్ఎస్‌యూ నేతలు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే మోదీ లక్ష్యం

పులివెందుల రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశంలోని ప్రతి పేద కుటుంబానికి అందించి వారిని ఆదుకోవడమే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ వంగళ శశిభూషణ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పీఎం కిసాన్ సన్మాన్ నిధి యోజన 20వ విడత నిధులను రైతుల ఖాతాల్లో జమచేశారన్నారు. పీఎం కిసాన్ పథకం రైతులకు భరోసాగా నిలుస్తోందన్నారు. ఇప్పటి వరకు 9.7కోట్ల అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.20,500కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు.

వృషభాచలేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వేంపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన వృషభాచలేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ శనివారం పురస్కరించుకొని అభిషేకపూజలు నిర్వహించారు. బెంగళూరు నుంచి తెప్పించిన పూలమాలలతో స్వామివారిని అలంకరించి పూజలు చేశారు. ఈనెల 9వ తేదీన ఎద్దుల కొండపై స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

ఘనంగా శ్రావణ మాసోత్సవాలు

సీకేదిన్నె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా అంజనేయస్వామికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, బండలాగుడు పోటీలు, కోలాటం నిర్వహించి కనువిందు చేశారు. బండలాగుడు పోటీల్లో మొత్తం 12 జతల ఎడ్లు పాల్గొన్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి బండలాగుడు పోటీలు ప్రారంభించి సాయంత్రం వరకు పోటాపోటీగా సాగాయి. అనంతరం గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు.

కమలాపురం రూరల్..: మండల పరిధిలోని సి.గోపులాపురం గ్రామం, కమలాపురం నగర పంచాయతీలో వెలసిన పిచ్చి అంజనేయస్వామి ఆలయం, కోగటం గ్రామ సమీపంలోని కుంట ఆంజనేయస్వామి ఆలయం తదితర గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

చెన్నూరు..: శ్రావణ శనివారం సందర్భంగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, వీరాంజనేయస్వామి ఆలయంలో పూజాది కార్యక్రమాలు జరిగాయి. వీరాంజనేయ స్వామి ఆలయానికి స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడం జరిగింది. అలాగే ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామవార్లకు విష్ణు సహస్ర నామాలు, గోవిందనామాలు గావించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో గరుడ సేవలో స్వామివారిని గరుడ పల్లకీలో ఆశీనులు చేసి ఊరేగింపు చేశారు.


చెన్నూరులో గరుడ సేవలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కడప - C.O.: 99854 04960
పులివెందుల - S.R.: 95812 61647
D.C.M.: 99854 11184

అన్నదాత సుఖీభవతో ఆర్థిక తోడ్పాటు

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో రైతులకు లబ్ధి ● ప్రకృతి వ్యవసాయం వైపు మారాలి ● ఎమ్మెల్యే ఆది, ఆర్డీవో సాయిశ్రీ, టీడీపీ నేతభూపేశ్‌రెడ్డి



జమ్మలమడుగులో అన్నదాత సుఖీభవ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆది, భూపేశ్ ఆర్డీవో సాయిశ్రీ



మైదుకూరులో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్

జమ్మలమడుగు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రైతుకు అన్నదాత సుఖీభవ ఆర్థిక తోడ్పాటునందిస్తుందని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులు రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేయాలని కోరారు. శనివారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో ప్రభుత్వం రైతులకు అందించే అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుల కళ్లల్లో ఆనందం చూడటమే ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఉద్దేశ్యమన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఏడాదికి రూ.13,500 ఇస్తే కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ఇవ్వడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ కింద మొదటి విడత కింద రూ.7 వేలు రైతుల ఖాతాల్లో వేశారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహకాలు అందిస్తున్నాయన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంవైపు మొగ్గు చూపాలన్నారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో 35,184 మంది రైతులకు రూ.24.11 కోట్లను అన్నదాత సుఖీభవ పథకం కింద విడుదల చేశారన్నారు. జమ్మలమడుగు మండలంలో 4,554 మంది రైతులకు రూ.3.12 కోట్లు, కొండాపురంలో 5480 మందిరైతులకు రూ.4 కోట్లు, మైలవరంలో 6261 మంది రైతులకు రూ.4.21 కోట్లు, పెద్దముడియం 7542 మంది రైతులకు 5.15 కోట్లు, ఎర్రగుంట్లలో 5597 మంది రైతులకు 3.84 కోట్లు రైతులకు వారి ఖాతాల్లో వేయడం జరిగిందన్నారు. అనంతరం డీపీఎం ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఎమ్మెల్యే, ఆర్డీవో పరిశీలించారు. జమ్మలమడుగు మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, ఏవో శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయాధికారులు, ప్రకృతి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో: అన్నదాత సుఖీభవ ద్వారా 6111 మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5వేలుతో మండలంలోని 6111 మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని ఏవో శివరామక్రిష్ణరెడ్డి తెలిపారు. శనివారం మండలానికి రూ.4.19 కోట్లు రైతు ఖాతాల్లో జమ అవుతోందన్నారు.

దువ్వూరులో: అన్నదాత పీఎం కిసాన్ నిధులు శనివారం రైతుల ఖాతాల్లో జమ అయినట్లు మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. పీఎం కిసాన్ పథకం నిధులు రూ.2 వేలు, అన్నదాత పథకం కింద రూ.5 వేలు తొలి విడతగా రైతులకు అందనున్నట్లు పేర్కొన్నారు. దువ్వూరు మండలానికి చెందిన 7,071 మంది రైతులకు రూ.4,94,099లు లబ్ధిచేకూరిందన్నారు.

మైదుకూరు రూరల్‌లో : రైతుల సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయమని మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర పేర్కొన్నారు.మండలంలోని వనిపెంట కృషి విజ్ఞానకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన రైతులు, అధికారులు సమావేశంలో అన్నదాత సుఖీభవ పథకం నిధుల విడుదల కార్యక్రమం జరిగింది. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషన్, బీజేపీ నేత బీపీ ప్రతాప్ పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో: మండలంలో అన్నదాత సుఖీభవ కింద 5862 మంది రైతులకు మొత్తం రూ.4.11 కోట్లు వారి ఖాతాల్లో జమ కావడం జరుగుతుందని పోరుమామిళ్ల ఏడీ మురళీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



ఆంజనేయస్వామి

కొండాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండాపురం, చౌటిపల్లె, దత్తాపురం, గండ్లూరు తదితర చోట్ల ఆంజనేయస్వామికి ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. చౌటిపల్లె ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా పాత మార్కెట్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. టుటౌన్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం, బుడ్డాయపల్లె, పాత బస్టాండు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత మార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా స్వామివారికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

అట్లూరులో: మండలంలోని కొండూరు పడమటి భాగాన కొండపై వెలసిన కొండగోపాలస్వామికి శ్రావణ శనివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు కొండపైకి ఎక్కి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త నందగో పాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు రాజగోపాలరెడ్డి, రాధాక్రిష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, పాలకొండ రాజగోపాల్‌రెడ్డి, గోపాలస్వామి కొండల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు నిర్వహించారు.

నరసింహుడికి ప్రత్యేక అలంకరణ

బద్వేలు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహుని ఆలయంలో శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామివారు కన్నులపండువగా దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కైంకర్యం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

రాయలసీమ టాపర్‌గా చిన్నకొమెర్ల వాసి భరత్



మైలవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ రాత పరీక్షలో మండల పరిధిలోని చిన్నకొమెర్ల గ్రామానికి చెందిన కర్నాటి అశ్వర్థ భరత్‌కుమార్‌రెడ్డి రాయలసీమ టాపర్‌గా 160 మార్కులతో స్టేట్ 10వ ర్యాంకు సాధించాడు. అతని తండ్రి జయరామిరెడ్డి పాలవ్యాపారం చేస్తుండగా తల్లి ఐవేశ్వరి కూలి పనులు చేసుకుంటూ భరత్‌ను చదివించారు. 1 నుంచి 10వ తరగతి వరకు చిన్నకొమెర్ల ప్రభుత్వ పాఠశాల జడ్పీ హైస్కూలులో చదివాడు. రాయలసీమ టాపర్‌గా నిలువడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పంటల బీమా నమోదుకు 14 వరకు గడువు

దువ్వూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటల బీమా నమోదుకు ఈనెల 14వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి శనివారం తెలిపారు. సాగుచేసిన పసుపు, ఉల్లి, కంది, వరి, మినుము, జొన్న పంటలకు బీమా చేసుకోవాలని రైతులకు సూచించారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

జమ్మలమడుగు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5వ తేదీ ఉదయం 9.30 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయభాస్కర్ తెలిపారు. 10వ తరగతి పాసై పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ రాయనివారు, క్వాలిఫై కానివారు ఇంకా ఎవరైనా గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో చేరవచ్చన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు మూడు సెట్ల జిరాక్స్ కాపీలతోపాటు కళాశాలకు రావలెనని తెలిపారు. ఏదైనా వివరాలకు 7901620171 ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

బ్రహ్మంసాగర్ నుంచి కుడి కాల్వకు నీరు విడుదల



బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ కుడికాల్వ నుంచి వంద క్యూసెక్కులు నీటిని తెలుగుగంగ ఇరిగేషన్ డీఈ మురళీమోహన్, బి.మఠం అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ముద్దం నాగేశ్వర్‌రావు యాదవ్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగ ఏఈఈ నాగేశ్వరయాదవ్ మాట్లాడుతూ వంద క్యూసెక్కులు బి.మఠం బద్వేలు కుడికాల్వ కింద 18 చెరువులకు నీరు వెళుతుందని అలాగే 8వేల ఎకరాలకు నేరుగా పంట పొలాల్లోకి నీరు చేరుతుందని ఆయన తెలిపారు. అలాగే రైతన్నలు నీటిని వృథా చేయకుండా వాడుకుంటే అవసరం ఉన్న భూములకు సకాలంలో నీరు చేరి పంటలుపుష్కలంగా పండుతాయని తెలిపారు. కాగా బ్రహ్మంసాగర్ కుడికాల్వ కింద ఉన్నటువంటి ఆయకట్టు రైతన్నలు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను కలిసి నీటిని విడుదల చేయాలని కోరడంతో వెంటనే తెలుగుగంగ అధికారులకు నీటిని విడుదల చేయాలని సూచించారు. ఆమేరకు అధికారులు నీటిని విడుదల చేశారు.

స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

బద్వేలు, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో లే అవుట్ రెగ్యులైజేషన్ జూలై 26వ నుంచి 90 రోజులలోపు ఎల్ఆర్ఎస్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో లే అవుట్ స్థలాలల క్రమబద్ధీకరణపై స్థల యజమానులకు ఉన్న సందేహాలు నివృత్తి చేశారు. అలాగే లే అవుట్ రెగ్యులరైజేషన్ పథకం నియమాల మేరకు జూన్30, 2025కు ముందు అనధికార లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు గాని, వ్యక్తిగత ప్లాట్ యజమానులు ఎవరైనా సదరు స్థలం క్రమబద్ధీకరణ కొరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ ప్రకారం 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలలో 50 శాతం రాయితీతో అలాగే 90 రోజులలోపు చెల్లించినట్లయితే 5 శాతం రాయితీ ఉంటుందన్నారు.

స్వామిత పథకం కింద పోరుమామిళ్ల పంచాయతీ ఎంపిక

పోరుమామిళ్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వామిత పథకం కింద పోరుమామిళ్ల మేజరు పంచాయతీ ఎంపికైందని సర్పంచ్ యనమల సుధాకర్ పంచాయతీ కార్యనిర్వహణాధికారి ఓబులేసు అన్నారు. శనివారం స్థానిక మేజరు పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో వారు మాట్లాడుతూ ఇంటికి సంబంధించిన కొలతలు, అధునాతన సాంకేతికతతో తీసుకుని ఇంటికి యాజమాన్య హక్కు ప్రభుత్వం వారు ఇస్తారని తెలిపారు. దీనికి అందరూ సహకరించాలని సచివాలయ సిబ్బంది ప్రజలను కోరారు. అలాగే పంచాయతీపరిధిలోని ముస్లింకోటవీధిలో పైపులైను లీకేజీ కావడంతో వారు స్వయంగా పర్యవేక్షించి మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో ధర్వేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బద్వేలుటౌన్, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మైదుకూరురోడ్డు జాతీయ రహదారిలో శనివారం రాత్రి వేగంగా వస్తున్న కారు రోడ్డు దాటుతున్న నాగేంద్ర అనే వ్యక్తిని ఢీ కొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అతడి కి రక్తస్రావం అధికంగా కావడంతో 108 వాహనం ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. నాగేంద్ర బంధువుల ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కుందూలో దూకిన వృద్ధ మహిళ?


రాజుపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్లాల వద్ద శనివారం ఉదయం కుందూలో ఒక వృద్ధ మహిళ దూకినట్లు అక్కడున్న స్థానికులు తెలిపారు. ఆ మహిళ తన బ్యాగు, ఫోను నెంబరు, చెప్పులను బ్రిడ్జిపై వదిలిపెట్టి కుందూలో దూకినట్లు తెలిపారు. మహిళ ఆళ్లగడ్డ టౌన్‌కు చెందినదిగా ఆమె పేరు కూడా బాలనాగమ్మ అని అక్కడివారు తెలిపారు. ఈమెకు పగిడాలలో బంధువులు కూడా ఉన్నట్లు అక్కడి ప్రజలు తెలుపుతున్నారు. రాత్రివరకు ఎలాంటి ఆచూకీ తెలియరాలేదు. వివరాలు తెలియాల్సి ఉంది.

స్వామితను సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టి స్వామిత పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌పీవో నూర్జహాన్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చౌడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లగా రిజిస్టర్‌కు నోచుకోకుండా నిలిచిపోయిన గ్రామ కంఠాలలోని ఇళ్లను, ఇళ్ల స్థలాలకు పర్సనల్ ప్రాపర్టీ మ్యాప్ అందజేస్తామని తెలిపారు. స్వామిత్వలో నమోదు అయిన ఆస్తులు రిజిస్ట్రేషన్ కావడంతోపాటు వాటికి బ్యాంకు రుణాలు కూడా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామాంజనేయులరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని శనివారం ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం వద్ద చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు నాయబ్‌రసూల్‌లు మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు అమృతంలాంటిదని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి పేర్కొన్నారు. శనివారం తల్లిపాల వారోత్సవాల్లో సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిధులుగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి, 5వ వార్డు కౌన్సిలర్ వంగనూరు మురళీదర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్దనూరులో:పుట్టినప్పటి నుంచి బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి సూచించారు. మండల పరిధి నల్లబల్లె గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవంలో ఆమె మాట్లాడుతూ బిడ్డపుట్టిన అరగంటలోపు తల్లి ముర్రపాలు శిశువుకు పట్టాలని దీనివల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, విశాలాక్షి, అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మినారాయణ మృతి సాహితీరంగానికి తీరని లోటు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రముఖ సాహితీ విమర్శకులు గంగిశెట్టి లక్ష్మినారాయణ మృతి సాహితీలోకానికి తీరని లోటని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం తెలిపారు. అనంతపురం జిల్లా కరికల్లులో జన్మించిన ఆయన తెలుగు విశ్వవిద్యాలయంలో స్థూలనాత్మక అధ్యయన విభాగానికి ప్రొఫెసర్‌గా పనిచేశారన్నారు. ఆయన అనేక పరిశోధన వ్యాసాలు రాసి గ్రంథస్తం చేశారని పేర్కొన్నారు. ఆయన ప్రొద్దుటూరుకు రెండు పర్యాయాలు వచ్చి వెళ్లారని తెలిపారు. అమెరికాలో ఆయన మృతిచెందారని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు.



రైతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం

● 34,148 మంది అన్నదాతలకు సుఖీభవ నిధులు రూ.23.25కోట్లు



రైతులకు చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

బద్వేలుటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం సంక్షోభంలో ఉన్నా వ్యవసాయాన్ని సంక్షేమం దిశగా తీసుకువెళ్లి రైతుల కళ్లలో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారెడ్డి, డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓ చంద్రమోహన్, బద్వేలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ మొదటి విడ త నిధుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ పీఎం కిషాన్ నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా బద్వేలు డివిజన్ పరిధిలోని 34,148మంది అన్నదాత కుటుంబాలకు రూ.23,25,000,00 చెక్కును అధికా రుల చేతుల మీదుగా రైతులకు అందించడం జరిగిందన్నారు. ఏడాదికి రూ.20వేలు రైతులకు అందించడం జరుగుతుందని, మూడు విడతలుగా రైతుల అకౌంట్లలో జమ చేయడం జరుగుతుందని అందులో మొదటి విడతా ఒక్కో రైతుకు రూ.7వేలు వారి ఖాతాల్లో జమకావడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం అందు తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏలు వెంకటసుబ్బయ్య, మురళీధర్ రెడ్డి, అన్ని మండలాల వ్యవసాయాధికారులు, వ్యవసాయ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరంలాంటిదని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పేర్కొన్నారు. జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో శనివారం 10 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యాలతో వివిధ ఇబ్బందుల్లో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అందించడం సంతోషకరమన్నారు. మైలవరం మండలానికి సంబంధించి 10 మందికి రూ.4,83,523 చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, బాధితులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ఆక్రమితభూమిలో హెచ్చరిక బోర్డు నాటిన రెవెన్యూ సిబ్బంది

బద్వేలు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుట్టాయపల్లె గ్రామంలో కత్తెరపల్లె రఘురామిరెడ్డి అనే వ్యక్తి 13 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి చదును చేయడంతో తహసీల్దారు ఉదయభాస్కర్ రాజు ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది శనివారం ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డును నాటారు. వివరాల్లోకి వెలితే పుట్టాయపల్లె గ్రామ సమీపంలో సర్వే నెం.315, 353, 354, 355లలో దాదాపు 13 ఎకరాల భూమిని కత్తెరపల్లె రఘురామిరెడ్డి అనే వ్యక్తి ఆక్రమించుకుని చదను చేశాడన్న సమాచారం రావడంతో తహసీల్దారు ఉదయభాస్కర్ రాజు వెంటనే తమ సిబ్బందిని గ్రామానికి పంపి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

టీడీపీ కార్యకర్తను ఆదుకున్నసభ్యత్వ నమోదు

కలసపాడు, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన టీడీపీ కార్యకర్త శవరమ్మ కుటుంబానికి రూ.5లక్షల ఇన్సూరెన్స్‌మంజూరైంది. టీడీపీ సభ్యత్వ నమోదు ఉండడంతో ఇది వారి కుటుంబానికి ఆసరాగా నిలిచింది. సింగరాయపల్లెకు చెందిన శవరమ్మ తన మనవడితో కలిసి ద్విచక్రవాహనంలో మే నెలలో కలసపాడు నుంచి సొంతగ్రామానికి వెళ్తుండగా బొలెరో వాహనం ఎదురుగా వచ్చి ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. శవరమ్మ పార్టీ సభ్యత్వం పొంది ఉండడంతో ఆమెకు రూ.5లక్షల ఇన్సూరెన్స్ మంజూరుకాగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం కలసపాడు మండల పార్టీ అధ్యక్షుడు జి.వెంకటరామిరెడ్డి శవరమ్మ భర్త భాస్కర్‌కు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులునందిగారి వెంకటసుబ్బారెడ్డి, నీటి సంఘం చైర్మన్ వెంకటరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, పల్లె హరిఓబుల్‌రెడ్డి, రోశిరెడ్డి, శ్రీనివాసులు, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

సీమకు జరిగిన అన్యాయంపై పార్లమెంటులో చర్చించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీబాగ్ ఒప్పందంలో రాయలసీమకు జరిగిన అన్యాయంపై పార్లమెంటులో చర్చించాలని రాయలసీమ రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు 88 సంవత్సరాలు అయినా శ్రీబాగ్ ఒప్పందం ద్వారా రాయలసీమకు న్యాయం జరుగులేదన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా కోస్తా తెలంగాణా కన్నా రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని శ్రీకృష్ణ కమిషన్ పేర్కొందన్నారు. శ్రీబాగ్ ఒప్పందంలో జరిగిన అన్యాయాలపై పార్లమెంటులో చర్చించి రాయలసీమకు న్యాయం జరగాలని లోక్‌సభ స్పీకర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర గవర్నర్‌లకు లేఖ రాసినట్లు తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టాలి : సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర

బద్వేలు, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో ప్రథమ వార్షికోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు ఇంటి స్థలాన్ని , అలాగే భూమిలేని పేదలకు కుటుంబానికి 3 ఎకరాలుమంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి వీరశేఖర్, కార్యవర్గ సభ్యులు బాలయ్య, మస్తాన్ తదితయులు పాల్గొన్నారు.

పేదవర్గాల వారిని ఆదుకునే కార్యక్రమమే పీ4



పీ4 కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బద్వేలు, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): పేదవర్గాల వారిని ఆదుకునే కార్యక్రమమే పీ4 అని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ కృష్ణ దేవరాయ నగర్ పరిధిలో శనివారం స్వయం సహాయక సంఘాల సభ్యుల గ్రూపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో చంద్రమోహన్, గోపవరం తహశీల్దారు త్రిభువన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలు పాల్గొని పీ4 కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. అట్టడుగున ఉన్న పేదల కుటుంబాలకు చెందిన వారిని అధిక సంపద ఉన్న వారు సపోర్టుగా నిలిచి వారి అభివృద్ధికి తోడ్పాటు నందించాలని తెలిపారు. అర్హత కలిగిన వారు వెంటనే సచివాలయంలో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

హైదరాబాద్‌కు వెళ్లి రోగికి పెన్షన్ అందజేత

కొండాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉన్నికాయిలపల్లె గ్రామానికి చెందిన బి.వెంకటలక్షుమ్మ అనే మహిళ కిడ్నీవ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా బి.కొట్టాపల్లె పంచాయతీ సెక్రటరీ రంగానాయకులు అక్కడికి వెళ్లి పెన్షన్ అందజేసినట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. వెంకటలక్షుమ్మ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గత రెండు నెలలుగా పెన్షన్ తీసుకోలేదన్నారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతూ ,స్వగ్రామానికి రాలేకపోవడంతోదీంతో ఆమెకు రావాల్సిన రెండునెలల డయాలసిస్ పెన్షన్ రూ.20,000ను హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో పంచాయతీ సెక్రటరీ శనివారం అందజేశాడన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
ప్రొద్దుటూరు - A.C.O.: 99854 11466 జమ్మలమడుగు - S.R.: 94404 72816 మైదుకూరు - S.R.: 91334 42886 బద్వేల్ - S.R.: 99666 83437 D.C.M. : 99854 11184